


RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 163 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | ఆగష్టు 02 - జులై - 2026 | వెల రూ. 5 /-

## వాట్సాప్ అంకుల్స్ పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు - కేటీఆర్



- వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్ జీ ఓటర్లు
- సోషల్ మీడియా వల్లే జవాబు దారీతనం పెరిగిందన్న కేటీఆర్
- నేటి యువతరం రీల్స్ రూపంలో వార్తలు చూస్తోందని వ్యాఖ్య

»2

## ప్రాణదాతగా మారిన హైదరాబాద్ మెట్రో..

### - 25 నిమిషాల్లో అవయవాల తరలింపు



- హైదరాబాద్ మెట్రోలో అవయవాల తరలింపునకు గ్రీన్ ఛానెల్
- గచ్చిబౌలి నుంచి సికింద్రాబాద్‌కు గుండె, ఊపిరితిత్తుల రవాణా
- 14 కిలోమీటర్ల దూరాన్ని 25 నిమిషాల్లోనే పూర్తి చేసిన వైనం
- ప్రాణాలను నిలబెట్టే చర్యలకు సహకారం కొన సాగిస్తామన్న అధికారులు



# నిండుకుండలా ఉప్పల్ నల్లచెరువు

### - హైడ్రా పనులతో మారిన రూపు..

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ఉప్పల్ నల్లచెరువు నిండు కుండను తలపిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ చెరువు జల కళను సంతరించుకుంది. గతంలో ఆక్రమణలు, మురుగునీటి ప్రవాహంతో కళావిహీనంగా మారిన ఈ చెరువు, హైడ్రా చేపట్టిన పునరుద్ధరణ చర్యలతో పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. సుమారు రూ. 20 కోట్ల అంచనా వ్యయంతో హైడ్రా అధికారులు చెరువు అభివృద్ధి పనులను చేపట్టారు. ఇందులో భాగంగా చెరువు శిఖం భూమిలోని ఆక్రమణలను తొలగించారు. పరిసర ప్రాంతాల్లో నుంచి వరద నీరు సులభంగా చెరువులోకి చేరేలా రెండు కొత్త ఇన్‌లెట్లను నిర్మించారు. అదే సమయంలో, మురుగునీరు చెరువులో కలవకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రత్యేక డైవర్షన్ కాలువను ఏర్పాటు చేశారు. చెరువు గరిష్ట స్థాయికి చేరినప్పుడు అదనపు నీరు సాఫీగా బయటకు వెళ్లేలా ఔట్‌లెట్లను ఆధునికీకరించారు. ఈ నీరు నేరుగా మూసీ నదిలో కలిసేలా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. దీనివల్ల ఉప్పల్ ప్రాంతంలో వరద ముప్పు గణనీయంగా తగ్గనుంది. ఈ చెరువును కేవలం నీటి వనరుగానే కాకుండా, భవిష్యత్తులో ఆహ్లాదకరమైన పర్యాటక, విహార కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

- భారీ వర్షాలతో పూర్తిగా నిండిపోయిన చెరువు
- రూ. 20 కోట్లతో హైడ్రా చేపట్టిన అభివృద్ధి పనుల సత్ఫలితం
- మురుగునీరు కలవకుండా ప్రత్యేక కాలువ నిర్మాణం
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధికారుల ప్రణాళిక

## మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది

### - సీజేఐ సూర్యకాంత్



- వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం భారత సంస్కృతిలో భాగమన్న సీజేఐ సూర్యకాంత్
- జైపూర్‌లో జరిగిన కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సులో కీలక ప్రసంగం
- వేదాలు, రామాయణ, మహాభారతాల్లోనే మధ్యవర్తిత్వ సూత్రాలున్నాయని వెల్లడి
- కౌటిల్యుడి అర్థశాస్త్రంలోని 'సామ' విధానాన్నే ఆధునిక మధ్యవర్తిత్వానికి మూలంగా పేర్కొన్న సీజేఐ
- చట్టం రాకముందే ఈ విధానం మన రక్తంలో ఇమిడిపోయిందని వ్యాఖ్య

**నేటి శుభోదయ, జైపూర్ :** వివాదాలను పరస్పర అంగీకారంతో, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం భారతీయ నాగరికతలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. జైపూర్‌లో నిర్వహిస్తున్న కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సు రెండో రోజైన శనివారం ఆయన ప్రసంగించారు. 2023లో మధ్యవర్తిత్వ చట్టం అమల్లోకి రాకముందు నుంచే మన సంస్కృతిలో ఈ విధానం ప్రాచుర్యంలో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో శాసన,..

2

# అజిత్ దోవల్‌కు లోక్‌మాన్య తిలక్ జాతీయ పురస్కారం

### - అమిత్ షా చేతుల మీదుగా ప్రధానం

- పుణేలో తిలక్ 106వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారం అందజేత
- కార్యక్రమంలో పాల్గొన్న ఫడ్నవిస్, ఏక్ నాథ్ షిండే, సునేత్ర పవార్
- జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు రూ. 1 లక్ష నగదు బహుమతి




**నేటి శుభోదయ, పుణే :** దేశ భద్రత, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో తిరుగులేని సేవలు అందించిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను 'లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డు' వరించింది. మహారాష్ట్రలోని పుణేలో బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అజిత్ దోవల్‌కు అందజేశారు. ఈ వేడుకలో లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్ట్ అధ్యక్షుడు ....

»2

## తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్

### - దరఖాస్తుల తేదీలు ఖరారు




- తెలంగాణలో 7,437 పోలీస్ పోస్టుల భర్తీకి ప్రకటన
- ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు
- పోలీస్, ఎస్పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో ఖాళీల భర్తీ
- నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసిన టీఎస్ఎల్‌పీఆర్‌బీ

»2

## ఉగ్రరూపం దాల్చిన గోదావరి

### - పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించిన మంత్రి సీతక్క

- భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు
- మంగపేటలో అధికారులతో కలిసి పర్యటించిన సీతక్క
- వరద నిర్వాసితులతో నేరుగా మాట్లాడిన మంత్రి



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయారు. ఈ నేపథ్యంలో, మంత్రి సీతక్క స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనకు దిగారు. భద్రాచలం ఎగువన ఉన్న మంగపేట మండల కేంద్రానికి ఈ ఉదయం చేరుకున్న ఆమె... గోదావరి ఉద్ధృతిని, కరకట్ట పనుల పురోగతిని సమీక్షించారు. లోతట్టు ప్రాంతాలు ఏ మేరకు ముంపునకు గురయ్యాయనే వివరాలను రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఐబీ అధికారులతో మాట్లాడి ఆరా తీశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పొద్మూరు, ముస్లిం వాడ, బీసీ కాలనీ పరిధిలోని ముంపు బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంత్రి సందర్శించారు. .....

2

# నాపై కోపంతోనే సొరంగం ఆపారు - కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్



- తనపై కోపంతోనే కేసీఆర్ ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని ఆపారని మంత్రి ఆరోపణ
- సొరంగం పూర్తయితే 4 లక్షల ఎకరాలకు నీరందేదని వ్యాఖ్య
- రూ.300 కోట్లతో పనులు మళ్లీ ప్రారంభించామని వెల్లడి
- 2028 జూలై నాటికి సొరంగం పూర్తి చేసి నీళ్లిస్తామని హామీ

**నేటి శుభోదయ, నల్గొండ :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనపై ఉన్న రాజకీయ కక్షతోనే శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనులను గతంలో కేసీఆర్ ఉద్దేశపూర్వకంగా విస్మరించారని ఆయన ఆరోపించారు. శనివారం నల్గొండ జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించిన మంత్రి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, "2007లోనే అమెరికా నుంచి యంత్రాలు...

»2



# వాట్సాప్ అంకుల్స్ పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు - కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి..** వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్-జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల నీట్ పరీక్ష వైఫల్యంపై జరిగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' విజయం సాధించారని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మారుతున్న రాజకీయ సమీకరణాలు, యువతరం ప్రాధాన్యతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "యువతరం సరికొత్త రీతిలో ఢిల్లీలో కదం తొక్కింది. ఎవరితోనైతే ఘర్షణకు వెళ్లకూడదో, ప్రధాని మోదీ సరిగ్గా వారితోనే తలపడ్డారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో 'వాట్సాప్ అంకుల్స్'తో సాగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' ఎలా పైచేయి సాధించారో దేశం మొత్తం చూసింది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సైతం అర్ధరాత్రి సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా లేకపోతే పాలకుల్లో జవాబుదారీతనం ఉండేది కాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నేటి యువత వార్తాపత్రికలు చదవడం గానీ, టీవీ ఛానెళ్లు చూడటం గానీ తగ్గించారని, 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారు వార్తలను సైతం రీల్స్ రూపంలోనే వీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది

## - సీజేఐ సూర్యకాంత్

**మొదటిపేజీ తరువాయి..** న్యాయవ్యవస్థలు ఈ పద్ధతిని మరింత బలోపేతం చేశాయని తెలిపారు. ఈ సందర్భంగా ఒక నారింజ పండు కోసం వివాదానికి దిగిన ఇద్దరు సోదరీమణుల కథను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. ఒకరికి పండు గుజ్జు, మరొకరికి తొక్క అవసరమైనప్పటికీ, ఆ విషయం స్పష్టంగా మాట్లాడుకోకపోవడంతో వారు పండును చెరిసగం పంచుకున్నారని, ముందే తమ అవసరాల గురించి చర్చించుకుని ఉంటే ఇద్దరికీ పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరేదని వివరించారు. మన ప్రాచీన గ్రంథాలైన వేదాలు, రామాయణం, మహాభారతాల్లోనూ మధ్యవర్తిత్వానికి సంబంధించిన అనేక అంశాలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో పేర్కొన్న సామ, దాన, భేద, దండోపాయం అనే నాలుగు పాలనా పద్ధతుల్లో మొదటిదైన 'సామ' నుంచే ఆధునిక మధ్యవర్తిత్వం ఉద్భవించిందని విశ్లేషించారు. భారతీయ సంప్రదాయంలో వివాద పరిష్కారానికి తొలుత కుటుంబం (కుల), తర్వాత వర్గం (శ్రేణి), ఆపై సభ (పుగ) వద్దకు వెళ్లేవారని, ఇవన్నీ విఫలమైనప్పుడే రాజును ఆశ్రయించేవారని తెలిపారు. అంటే ఏ సమస్యకైనా మొదటి అడుగు ఎప్పుడూ సంప్రదింపులేనని ఆయన వివరించారు. ఇరుపక్షాల మధ్య స్నేహపూర్వక పరిష్కారం కుదర్చడమే తన న్యాయవాద వృత్తిలో అత్యంత సంతృప్తినిచ్చిన అనుభవమని మహాత్మా గాంధీ చెప్పిన మాటలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. మధ్యవర్తిత్వం అనేది చట్టబద్ధం కావడానికి ముందే భారతీయుల రక్తంలో ప్రవహిస్తోందని, అది మన సంస్కృతిలో విడదీయరాని భాగమని జస్టిస్ సూర్యకాంత్ తన ప్రసంగంలో వివరించారు.

# అజిత్ దోవల్‌కు లోక్‌మాన్య తిలక్ జాతీయ పురస్కారం

**మొదటిపేజీ తరువాయి..** డాక్టర్ రోహిత్ తిలక్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు ఏక్ నాథ్ షిండే, సునేత్ర పవార్‌లతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అవార్డు కింద ఒక జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు రూ. 1 లక్ష నగదు బహుమతిని అందజేశారు. దేశ భద్రత, దౌత్యం, ఇంటెలిజెన్స్ రంగాలలో సుదీర్ఘ అనుభవం ఉన్న అజిత్ దోవల్ (81) భారత రక్షణ వ్యవస్థలో కీలక పాత్ర పోషించారు. 'ఆపరేషన్ బ్లాక్ థండర్', డోక్లామ్ వివాదంలో వ్యూహాత్మక దౌత్య చర్చలు, బాలాకోట్ వైమానిక దాడుల రూపకల్పనలో ఆయన పాత్ర అత్యంత ప్రశంసనీయం. 1968 కేరళ కేడర్‌కు చెందిన ఈ మాజీ ఐపీఎస్ అధికారి, మూడు దశాబ్దాలకు పైగా భారత ఇంటెలిజెన్స్‌లో పనిచేసి, ఆ తర్వాత ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌గా సేవలు అందించారు. మిజోరం, సిక్కిం, పంజాబ్, జమ్మూకశ్మీర్ వంటి తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలతో పాటు ఇస్లామాబాద్, లండన్‌లలో భారత దౌత్య కార్యాలయాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తమ రంగాల్లో సేవలు అందిస్తూ భారత్‌ను అత్యున్నత స్థాయిలో నిలిపిన ప్రముఖులకు ప్రతి ఏటా ఈ లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డును ప్రదానం చేస్తున్నారు.

# ప్రాణదాతగా మారిన హైదరాబాద్ మెట్రో..

## - 25 నిమిషాల్లో అవయవాల తరలింపు

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్ మెట్రో రైలు అత్యవసర అవయవ మార్పిడి కోసం ప్రత్యేక 'గ్రీన్ ఛానెల్'ను ఏర్పాటు చేసి, ప్రాణాలను కాపాడే బృహత్కార్యంలో కీలక భాగస్వామిగా నిలిచింది. గచ్చిబౌలి నుంచి సికింద్రాబాద్‌కు సజీవ అవయవాలైన గుండె, ఊపిరితిత్తులను మెట్రో ద్వారా అత్యంత వేగంగా తరలించారు. గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రి నుంచి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి ఈ అవయవాలను తరలించాల్సి ఉండగా, రోడ్డు మార్గంలోని ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వైద్య బృందం మెట్రో అధికారుల సహకారం కోరింది. దీనిపై తక్షణమే స్పందించిన అధికారులు ప్రత్యేక గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. ఫలితంగా దాదాపు 14 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 25 నిమిషాల్లోనే అధిగమించి, అవయవాలను సురక్షితంగా కిమ్స్ ఆసుపత్రికి చేర్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అత్యవసర వైద్య సేవలకు, ప్రాణ రక్షణ చర్యలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మెట్రో రైలు అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. కీలక సమయంలో మెట్రో అధికారులు ప్రదర్శించిన సమయస్ఫూర్తి, చొరవపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# నాపై కోపంతోనే సొరంగం ఆపారు

## - కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్

**మొదటిపేజీ తరువాయి..** తెప్పించి సొరంగం పనులు ప్రారంభిస్తే, కేవలం నాకు పేరు వస్తుందనే దురుద్దేశంతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక వాటిని నిలిపివేశారు. అప్పట్లో ఆ పనులను కొనసాగించి ఉంటే రూ.1,000 కోట్లతో రెండేళ్లలోనే పూర్తయ్యేవి. నేను ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేసీఆర్ కనికరించలేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. సొరంగం పనులు పూర్తయి ఉంటే, ప్రస్తుత కరవు పరిస్థితుల్లోనూ నల్గొండ ప్రాంతంలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, తాము అమెరికాకు వెళ్లి కాంట్రాక్టర్‌కు రూ.300 కోట్లు చెల్లించి పనులను పునరుద్ధరించామని తెలిపారు. వచ్చే రెండేళ్లలో సొరంగం పనులు పూర్తి చేసి, రెండు పంటలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. 2028 జూలై నాటికి ఈ సొరంగాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయనందుకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. వారి వైఫల్యం వల్లే ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారని, అందుకే గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల నాటికి తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

# తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ - దరఖాస్తుల తేదీలు ఖరారు

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ తేదీలను ప్రభుత్వం ఖరారు చేసింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) బుధవారం నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసింది. పోలీస్ శాఖతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీ ఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లోని ఖాళీలను ఈ నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. మొత్తం ఖాళీలలో అత్యధికంగా కానిస్టేబు ల్, ఆ పైస్థాయి ఉద్యోగాలే ఉన్నట్లు అధికా రులు పేర్కొన్నారు. పోస్టుల వివరాలను పరిశీలిస్తే సివిల్ ఎస్సై–148, ఏఆర్ ఎస్సై–14, టీజీఎస్పీ ఏఆర్ ఎస్సై–12, ఎస్ఏఆర్ సీపీఎల్ ఎస్సై–03, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై–23, సివిల్ కానిస్టేబుల్–3,697, ఏఆర్ కానిస్టేబుల్–1,052, ఎస్ఏఆర్ సీపీఎల్ కానిస్టేబుల్–24, కానిస్టేబుల్ (డ్రైవర్) పీటీవో–20, కానిస్టేబుల్ (మెకానిక్) పీటీవో–07 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

# ఉగ్రరూపం దాల్చిన గోదావరి

## - పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించిన మంత్రి సీతక్క



**మొదటిపేజీ తరువాయి..** నిర్వాసితులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న భోజన, వసతి సౌకర్యాలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. గోదావరి ఉద్ధృతి తగ్గేవరకు అధికారులు ఎవరూ హెడ్‌క్వార్టర్స్ వదలి వెళ్లకుండా నిరంతరం అందుబాటులోనే ఉండాలని, నిర్వాసితులకు అవసరమైన సహాయక చర్యలు త్వరితగతిన అందించాలని సీతక్క ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న లోతట్టు ముంపు పరిస్థితులపై తహసీల్దార్ తోట రవీందర్, ఎస్సై టీవీఆర్ సూరి, ఎంపీడీవో భద్రులు మంత్రికి నివేదించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మండల పార్టీ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, సీనియర్ నాయకులు మైల జయరాంరెడ్డి, వెంకట్ రెడ్డి, భగవాన్ రెడ్డి, మల్లయ్య, పెద్ది నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్

## - తెలంగాణ స్పీకర్ ఛాంబర్‌లో కమిటీ కీలక భేటీ

- అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలకు చెక్ పెట్టడమే ప్రభుత్వ లక్ష్యమన్న పొన్నం ప్రభాకర్
- వారం రోజుల్లో మరోసారి భేటీ కానున్న కమిటీ
- అన్ని పార్టీల సలహాలు తీసుకుంటామన్న మంత్రి



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** అసెంబ్లీలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలను నిరోధించేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నాహకాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో సెలెక్ట్ కమిటీ చైర్మన్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈరోజు కీలక సమావేశం జరిగింది. ఈ భేటీకి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవ లక్ష్మీ, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు హాజరయ్యారు. సమావేశంలో విద్వేష ప్రసంగాలు, క్రైమ్ బిల్లు ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ... అసెంబ్లీ పరిధిలో సభ్యులు భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకుంటూనే, ఇతరులను వ్యక్తిగతంగా దూషించడం లేదా విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా ఉండేలా బలమైన చట్టం తీసుకురావడమే తమ కమిటీ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. శాసనసభ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఈ క్రైమ్ అండ్ హేట్ స్పీచ్ బిల్లుపై పూర్తి నివేదికను అసెంబ్లీకి సమర్పించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో కమిటీ మరోసారి సమావేశం కానుంది. వివిధ రాజకీయ పార్టీలతో పాటు సమాజంలోని ప్రముఖులు, నిపుణుల సలహాలను పరిగణనలోకి తీసుకుని నివేదికను తుదిరూపు ఇస్తామన్నారు. ఈ చట్టం ఎవరి హక్కులనూ కాలరాయదని, కేవలం సభ గౌరవాన్ని, వ్యక్తుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకేనని భరోసా ఇచ్చారు.

## తాళ్ల రామడుగు సీతారామచంద్ర స్వామి ఆలయంలో వైభవంగా శనివారం అన్నదాన కార్యక్రమం

**నిజామాబాద్ రూరల్ సిరికొండ, జులై 01, నేటి శుభోదయ :** సిరికొండ మండలం లోని తాళ్ల రామడుగు గ్రామ శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతి శనివారం క్రమం తప్పకుండా నిర్వహించే నిత్య అన్నసత్ర కార్యక్రమంలో భాగంగా ఈ వారం అన్నదాన కార్యక్రమాన్ని నాంపల్లి చిన్న బాలయ్య తాళ్ల రామడుగు నిర్వహించారు.ఈ సందర్భంగా దాత నాంపల్లి చిన్న బాలయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు స్వయంగా అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ... ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం అత్యంత పవిత్రమైన సేవ అని, ప్రతి శనివారం ఆలయంలో ఈ రకమైన అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి కోశాధికారి నక్క రాజేందర్, ఉపాధ్యక్షులు పెండ్లి రాజేశ్వర్,బెల్దారి నరేష్, బీరయ్య,గ్రామానికి చెందిన పలువురు భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు విశేష సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.





## బూత్ లెవెల్ ఏజెంట్లకు అభినందనలు
### : జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

**ఖమ్మం, జులై 01, నేటి శుభోదయ :** బూత్ లెవెల్ ఏజెంట్లకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఐ సి సి ఆదేశానుసారం టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచనల మేరకు సంబంధిత శాసనసభ సభ్యుల ఆమోదంతో నియమించబడిన బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ తేదీ 24-06-2026 మొదలైన నాటి నుండి సంబంధిత అధికారుల సమన్వయంతో పనిచేశారని జిల్లాలో మొత్తం1460 బూత్ లకు ఈనాటికి 677 బూత్ లలో 100 శాతం,544 బూత్ లలో 95 శాతం,158 బూత్ లలో 90 శాతం నమోదు పూర్తి అయిందని క్షేత్ర స్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్లకు, బూత్ లెవెల్ సూపర్ వైజర్ లకు,నాయకులకు అధికారులతో సమన్వయంతోపనిచేసిన అందరికి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.అదే విధంగా మధిర నియోజకవర్గ శాసనసభ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు,పాలేరు నియోజకవర్గ శాసనసభ సభ్యులు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ఖమ్మం నియోజకవర్గ శాసనసభ సభ్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా నియోజకవర్గ శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ సభ్యులు మట్టా రాగమయి దయానంద్ లకు ప్రత్యేకంగా కృతజ్ఞతాభి నందనలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు



నూతి సత్యనారాయణ గౌడ్.అదే విధంగా ఆగష్టు 10 వ తేదీ వరకు గడువు పెంచి నందున అన్ని బూత్ లలో 100 శాతం పూర్తి చేయాలని బూత్ లెవెల్ ఏజెంట్లను, బూత్ లెవెల్ సూపర్ వైజర్, నాయకులను కోరారు.

## హోన్నజిపేట్‌లో పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్ల పంపిణీ

**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, జులై 01, నేటి శుభోదయ :** వర్షాకాలంలో గ్రామ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ధర్పల్లి మండలం హోన్నజిపేట్ గ్రామంలో శనివారం పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ఆశవ్వ బాబయ్య చేతుల మీదుగా కార్మికులకు ఈ రెయిన్‌కోట్లను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... వర్షాలను సైతం లెక్కచేయకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. వారి ఆరోగ్య పరిరక్షణ మరియు సౌకర్యం కోసమే ఈ సహాయం అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురేందర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి



గంగాధర్, వార్డు సభ్యులు రాఘవేందర్, బాలయ్య, అనిల్, గంగారాం, మల్లేష్, పద్మ, లలిత, లావణ్య, రూప లావణ్యలతో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీవ్ గృహకల్ప షాపింగ్ కాంప్లెక్స్ స్థలంపై భూ కబ్జా..
## అక్రమ నిర్మాణాలు, చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**జగద్గిరిగుట్ట ,ఆగస్టు 1, నేటి శుభోదయ :** కూకట్పల్లి లో ని జగద్గిరిగుట్ట గ్రామంలోని రాజీవ్ గృహకల్ప సొసైటీకి కేటాయించిన షాపింగ్ కాంప్లెక్స్ స్థలాన్ని భూ కబ్జాదారులు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపించారు.స్థానికుల కథనం ప్రకారం, కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్ట గ్రామంలోని సర్వే నంబర్ 348/1లో రాజీవ్ గృహకల్ప సొసైటీ షాపింగ్ కాంప్లెక్స్ కోసం కేటాయించిన సుమారు ఒక ఎకరం ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి, చుట్టూ ప్రహారీ గోడ నిర్మించి భవన నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు.శనివారం, ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఉండటాన్ని ఆసరాగా చేసుకుని నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. రాజీవ్ గృహకల్ప సొసైటీ నిర్మాణం కోసం మొత్తం 14 ఎకరాల 78 సెంట్ల ప్రభుత్వ భూమి కేటాయించగా, అందులో 54 బ్లాకులు నిర్మించి 1,779 నిరుపేద కుటుంబాలకు ఉచితంగా ఇళ్లను అందజేసినట్లు తెలిపారు. అదే ప్రాంగణంలో నివాసితుల అవసరాల కోసం షాపింగ్ కాంప్లెక్స్‌కు ప్రత్యేకంగా స్థలం కేటాయించినట్లు పేర్కొన్నారు.అయితే కొందరు నాయకులమని చెప్పుకుంటూ



బ్రోకర్లుగా వ్యవహరిస్తున్న వ్యక్తులు ప్రభుత్వ భూమిని అక్రమంగా విక్రయించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మండల రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి భూ కబ్జాలను తొలగించి, ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు.గమనిక: ఈ కథనంలోని భూ కబ్జా, అక్రమ నిర్మాణాల ఆరోపణలు స్థానికులు చేసినవే. సంబంధిత అధికారుల స్పందన అందాల్సి ఉంది.

## సి. వై. పుల్లయ్య కు కవులు, కళాకారుల చే ఆత్మీయ సత్కారం




**ఖమ్మం, జులై 01, నేటి శుభోదయ :** సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ప్రజా నాయకులు సివై పుల్లయ్య కు కవులు కళాకారుల చే ఆత్మీయ సత్కారం చేశారు. ఖమ్మం నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సి వై పుల్లయ్య, ఝాన్సీ దంపతులను శాలువాలతోసత్కరించి, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి ఉద్యమం నుంచి ప్రజా ఉద్యమాలకు ఎంతో కృషి చేసి అనేక విజయాలు సాధించారని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి ఐనాల సైదులు, ప్రకృతి వైద్యులు పిసి వి స్వామి, జానపద యుద్ధనౌక పమ్మి రవి,ప్రజాగాయకుడు పాగి వెంకన్న, సినీ గాయకుడు అలవాల నందు, తెలంగాణ ధూంధాం గాయకులు గోవింద గురువయ్య, సినీ నటులు మిమిక్రీభద్ర, కోలాటం మాస్టర్ శ్రీకాంత్ కన్నా, పెదపాక విజయ్, వంగపండు పుల్లారావు, రాందాస్, రంజిత్, అరుణోదయ శ్రీను పాల్గొన్నారు.

## ధర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రి నూతన వైద్యుడిగా డాక్టర్ శశాంక్ బాధ్యతల స్వీకరణ



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, ఆగస్టు 01, నేటి శుభోదయ :** ధర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నూతన వైద్యుడిగా డాక్టర్ శశాంక్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా డాక్టర్ శశాంక్ మాట్లాడుతూ... ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో లభించే వైద్య సేవలను, ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శశాంక్‌కు ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## ధర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన గ్రామ సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి , జులై 01, నేటి శుభోదయ** ధర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని గ్రామ సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్ శనివారం సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ శశాంక్, ఉపసర్పంచ్ ఎజ్జ శ్రీకాంత్, గ్రామ కార్యదర్శి రాకేష్, వీడీసీ ఛైర్మన్ ఆర్మూర్ రంజిత్, విష్ణు, హెడ్ నర్సులు జారీనా, రత్నకుమారి, స్టాఫ్ నర్సులు అరుణ, సుజన, ముంతాజ్, సిబ్బంది మురళి, సురేష్, పద్మ, మీనా మరియు ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### -బాధితులను పరామర్శించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్...



**నిజామాబాద్, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. శ నివార ం 42వ డివిజన్లోని చంద్రశేఖర్ కాలనీలో ఇటివల ఎడతెరిపిలేని వర్షం కారణంగా షేక్ ఫిరోజ్ ఇళ్లు కూలిపోవడంతో పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....వర్షం కారణంగా ఇబ్బందులు ఏర్పడితే అధికారులకు,స్థానిక కార్పొరేటర్లకు సంప్రదించాలని కోరారు.సంబంధిత అధికారులు సైతం లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించి,ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు.అలాగే ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు.అనంతరం నెలవారి నిత్యవసర సరుకులతో పాటు ఆర్థిక సాయం అందించారు.కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బెల్లాల్ శశాంక్,19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ,పసునూరి రాము,జ్యోతి మురళి,బంటు ప్రీతి ప్రవీణ్,ప్రసూన శ్రీనివాస్,శ్యామల సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

## యూత్త దేవి హాఫ్ సారీ వేడుకలో పాల్గొన్న వీరశైవ లింగాయత్ సమాజ ప్రముఖులు



**సంగారెడ్డి, జులై 01, నేటి శుభోదయ :** సదాశివపేటకు చెందిన వీరశైవ లింగాయత్ సమాజ సభ్యులు శివశ్రీ లోకేష్ – అర్చన దంపతుల కుమార్తె యోధాదేవి హాఫ్ సారీ వేడుక ఘనంగా నిర్వహించబడింది.ఈ శుభకార్యానికి రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షులు బిడకన హనుమంతు, బసవ రాజ్ అడ్వకేట్, ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సతీష్,వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు గదిగా రాజు, కార్యనిర్వాక అధ్యక్షులు అనిమిశెట్టి జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, వైద్యనాథ్, సింధోల్ వినోద్, పాటు వీరశైవ లింగాయత్ సమాజ ప్రముఖులు, సభ్యులు హాజరై యూత్త దేవికి ఆశీర్వచనాలు అందించి, లోకేష్ – అర్చన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సమాజ సభ్యులు మాట్లాడుతూ, ఇలాంటి శుభకార్యాలు కుటుంబ బంధాలను, సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు

## ప్రపంచ తల్లిపాల బారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

### -జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**మంథని/భూపాలపల్లి, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** తల్లి తన బిడ్డకు ఇవ్వగల మొట్టమొదటి కానుక పుట్టిన వెంటనే ముర్రు పాలు ఇవ్వడమేనని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.శనివారం ఐడిఓసి కార్యాలయంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు నిర్వహించనున్న "ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు" పోస్టర్ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం "సుస్థిరమైన జీవితం ప్రారంభానికి తల్లిపాలు – ఫలితాలను ఇచ్చే చర్యలను మరింత బలోపేతం చేయడం" అనే థీమ్తో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహద పడుతాయని, అలాగే వివిధ వ్యాధుల నుండి రక్షణ కల్పించి తల్లి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు.అంగన్వాడీ, ఆరోగ్య శాఖలసిబ్బంది పరస్పర సమన్వయంతో ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, తల్లిపాల ప్రాముఖ్యతను గర్భిణీలు, బాలింతలు మరియు కుటుంబ సభ్యులకు వివరించాలని సూచించారు. పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం, మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలనే ఇవ్వడం, తదుపరి సమయానుకూలంగా పోషకాహారం ఇవ్వడం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మల్లీశ్వరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, డిపిఆర్ఓ శ్రీనివాస్, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ యోచన తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఎజెండాగా...

- 3 న టి యు డబ్ల్యూ జే (ఐ జేయు)జిల్లా కార్యవర్గ సమావేశం !
- జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి



**సంగారెడ్డి, జులై 01, నేటి శుభోదయ :** తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి యు డబ్ల్యూ జే –ఐ జే యు) సంగారెడ్డి జిల్లా శాఖ తొలి కార్యవర్గ సమావేశం సోమవారం నాడు సదాశివపేటలో జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఆర్ అనిల్ కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్ శనివారం తెలిపారు. జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ,ఈ సమావేశానికి చాలా ప్రాధాన్యత ఉన్నదని వారు అన్నారు.గత నెల 9వ తేదీన సంగారెడ్డిలో జిల్లా మహాసభ ను జర్నలిస్టుల ఆకాంక్షలకు అనుగుణంగా పెద్ద ఎత్తున నిర్వహించినట్లు వారు చెప్పారు. జిల్లా నలు మూలల నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులు హాజరైనందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా దశాబ్దాలుగా తమ సంఘం పనిచేస్తున్నదని వారు వివరించారు. వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయించడంతో పాటు... వాటిని మండల స్థాయి గ్రామీణ జర్నలిస్టులకు కూడా ప్రభుత్వం ఇచ్చే విధంగా పోరాటం చేశామన్నారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో... నేడు తెలంగాణలో కూడా జర్నలిస్టుల అభివృద్ధికి, సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న సంఘం గా ఉన్నామని బండారు యాదగిరి వివరించారు. సదాశివపేటలో సోమవారం జరిగే జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే పైసల్ హాజరవుతున్నారని వివరించారు. ఈ సమావేశంలో అనేక విషయాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం సాధించేందుకు చర్చిస్తామని అన్నారు. అదేవిధంగా ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డు మంజూరు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ని నియోజకవర్గస్థాయి కమిటీల ఏర్పాటు గురించి చర్చిస్తామని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమము, అభివృద్ధికి సంబంధించిన ఇతర అంశాలపై కూడా ఈ సమావేశంలో కార్యాచరణ ప్రకటించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ముసి ముసి నవ్వుల చిరుప్రాయం బాల్యం

### -బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత



**సంగారెడ్డి , జులై 01, నేటి శుభోదయ :** * బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్టాత్మక కార్యక్రమాలు – ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్.* ఆపరేషన్ ముస్కాన్–XII ద్వారా సంగారెడ్డి జిల్లాలో 173 మంది బాల కార్మికులకు విముక్తి.* బాలలను కార్మికులుగా పనిలో పెట్టుకున్న 136 మంది యజమానులపై కేసులు నమోదు.* ఆపరేషన్ ముస్కాన్–XII విజయవంతానికి కృషి చేసిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని అభినందించిన అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపిఎస్.సంగారెడ్డి జిల్లా సురక్ష ప్రతినిధి: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని, జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ పేర్లతో విస్తృత తనిఖీలు చేపట్టి బాల కార్మికులను గుర్తించి, రక్షించడం జరుగుతుందని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపిఎస్. తెలిపారు.ఆపరేషన్ ముస్కాన్–XIIలో భాగంగా గత నెల జూలై 1 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో 173 మంది బాల కార్మికులను రక్షించడం జరిగిందని, వీరిలో 168 మంది బాలురు, 05 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. బాలలను చట్టవిరుద్ధంగా పనిలో పెట్టుకున్న 136 మంది యజమానులపై కేసులు నమోదు చేసి, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు.రక్షించిన బాలలను సంబంధిత శాఖల సమన్వయంతో పునరావాసం కల్పించి, విద్యాభ్యాసం కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాలల హక్కులను పరిరక్షించడం, వారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఆపరేషన్ ముస్కాన్–XIIను విజయవంతం చేయడంలో పోలీసు శాఖ, కార్మిక శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, విద్యాశాఖ, మెడికల్ డిపార్ట్మెంట్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయం అభినందనీయం అన్నారు.18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలను పనిలో పెట్టుకోవడం, వెట్టిచాకిరి చేయించడం, బలవంతంగా భిక్షాటన చేయించడం, పశువుల కాపరులుగా, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫారాలు, పరిశ్రమలు లేదా ఇతర పనులు చేయడం చట్టరీత్యా నేరమని అదనపు ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపించినా లేదా బాలలపై వేధింపులు, దోపిడీ జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే చైల్డ్ హెల్ప్లైన్ – 1098 లేదా డయల్–100కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## ఊర పండుగ ఏర్పాట్లను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**నిజామాబాద్, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** నిజామాబాద్ నగరంలో నిర్వహించనున్న సంప్రదాయ ఊర పండుగ ఏర్పాట్లకు సంబంధించి నగర మేయర్ కూరగాయల ఉమారాణి,నగర డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ,సర్వసమాజ్ కమిటీ ప్రతినిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....వేడుకలకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున,ఊరేగింపు మార్గాల్లో,ఆలయ పరిసరాల్లో పారిశుధ్య చర్యలు సక్రమంగా ఉండాలని,వేడుకల సందర్భంగా ప్రధాన మార్గాలు,ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని,ఊరేగింపు సాగే దారుల్లో వీధి దీపాలు అన్నీ సక్రమంగా పనిచేసేలా చూడాలని మునిసిపల్ అధికారులకు సూచించారు.భక్తులు ఊరేగింపు వెళ్లే మార్గాల్లో గుంతలను పూడ్చి,రోడ్లను సుగమం చేయాలని అధికారులకు ప్రతిపాదించారు.పండుగ నిర్వహణ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపు,పోలీసు బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు,రక్షణ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.నగరపాలక సంస్థ అధికారులు,సర్వసమాజ్ కమిటీ సభ్యులు,ప్రజా ప్రతినిధులు పరస్పరం సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్,హెల్త్ క్యాంపులను సిద్ధంగా ఉంచాలని అధికారులను కోరారు.సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రధాన కూడళ్ల వద్ద తాగునీటి చలివేంద్రాలు,నీడ కొరకు షామియానాలు ఏర్పాటు చేయనున్నారు.నాయకులు & కమిటీ సందేశంనగర శాంతిభద్రతలకు,సోదరభావానికి ప్రతీకగా నిలిచే ఈ ఊరపండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో,ఉత్సాహంగా జరుపుకోవాలని,కార్పొరేషన్ యంత్రాంగం,ప్రజా ప్రతినిధులు పండుగ ముగిసే వరకు పూర్తి సహకారాన్ని అందిస్తారని ఈ సందర్భంగా తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్,సానిటరీ సిబ్బంది,సర్వసమాజ్ కమిటీ కన్వీనర్ రామర్తి గంగాధర్,కోకన్వీనర్ ఆదే ప్రవీణ్,కోఆప్షన్ మెంబెర్ నరేందర్ సింగ్,కాంగ్రెస్ నాయకులు కరాటే రమేష్,బంటు బలరాం,ఆమ రాజు,లవంగ ప్రమోద్,అవీన్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితోనే నేటి 'జైల్ భరో' పోరాటం



**సంగారెడ్డి, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** 1942 క్విట్ ఇండియా ఉద్యమం బ్రిటిష్ సామ్రాజ్య పతనానికి నాంది పలికినట్లే, ఆగస్టు 10న జరిగే దేశవ్యాప్త 'జైల్ భరో' ఉద్యమం కార్పొరేట్–మతోన్మాద శక్తుల అంతానికి దారితీయ్యలని శ్రామికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు ప్రజా ప్రతిఘటనలో భాగస్వాములు కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారుఆగస్టు 10న జైల్ బరో జయప్రదం కోసం నేడు సదాశివపేటలో సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మండల సదస్సు నిర్వహించడం జరిగింది ఈ సదస్సుకు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ రమేష్ గౌడ్ అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, దేశాన్ని కార్పొరేట్ గుత్తాధిపత్య శక్తులకు అప్పగిస్తూ, మతోన్మాద రాజకీయాలతో ప్రజలను విభజిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ప్రజా ఉద్యమాల ద్వారానే ఓడించగలమని అన్నారు.లేబర్ కోడ్స్ కార్మికుల కోసం కాదు – యజమానుల కోసం రూపొందించిన కోడ్స్. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి ఉపాధి హక్కు స్థానంలో నిరుద్యోగ హామీ పథకాన్ని తీసుకొచ్చారు. రైతులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర (MSP)ను నిరాకరిస్తున్నారు. భూమిలేని పేదలకు భూమి, ఇంటి స్థలాలు ఇవ్వడం లేదు. పీడీఎస్ ను బలోపేతం చేయడం లేదు.ఎస్సీ, ఎస్టీల రాజ్యాంగ హక్కులపై దాడులు కొనసాగుతున్నాయి. మహిళల హక్కులను బలహీనపరిచే విధానాలు అమలు చేస్తున్నారు. విద్యారంగాన్ని కార్పొరేటీకరించే నూతన విద్యా విధానం (NEP), NTA పరీక్షల విధానం ద్వారా విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారు అని విమర్శించారు.ఢిల్లీ విద్యార్థి ఉద్యమం చూపిన పోరాట స్ఫూర్తితో దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజనులు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా ఉద్యమాలను నిర్మించి మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రజా ప్రతిఘటనను కేసులు, అరెస్టులు, జైళ్లతో అణచివేయాలని చూసిన ప్రతి పాలక వర్గం చివరికి ప్రజల ముందే తలవంచక తప్పలేదని చరిత్ర నిరూపించింది. ప్రతిఘటనను ఎంత అడ్డుకుంటే అంతగా ప్రజా ఉద్యమం ఉప్పొంగుతుంది. కార్పొరేట్–మతోన్మాద కూటమి పతనం అనివార్యం. శ్రామిక ప్రజల ఐక్య పోరాటమే దేశాన్ని కాపాడగలదు అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దశరథ్ శ్రీనివాస్ మల్లేశం శేఖర్ రుక్కమ్మ మొగులమ్మ, లావణ్య. రైతు సంఘం నాయకులు భూషణం నర్సింలు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యోసబ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపేటలో ప్రభుత్వ భూముల పరిరక్షణ కరువు



**సంగారెడ్డి, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** సదాశివపేట పట్టణంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పట్టణ పరిధిలోని 414 సర్వే నంబర్లో ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని, దాని విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందని మాజీ కౌన్సిలర్ చౌదరి ప్రకాష్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వ ఆస్తులు, విలువైన స్థలాలను పరిరక్షించేందుకు చర్యలు చేపడతారని ప్రజలు ఆశించారని ప్రకాష్ పేర్కొన్నారు. అయితే, సదాశివపేటలోని కొన్ని ప్రభుత్వ స్థలాల విషయంలో సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తగిన స్థాయిలో స్పందించడం లేదని ఆయన ఆరోపించారు.ప్రధాన రహదారి పక్కన ఉన్న 414 సర్వే నంబర్లోని స్థలం ప్రభుత్వ భూమేనని, ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించిన కళ్ళు లేని కళ్లు బోదుళ్ల ఉండుటంపై తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. ఈ భూమి విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందన్నారు. ప్రభుత్వం స్థలాలు భూములు ఆక్రమణలను అడ్డుకోకపోవటం ఏమిటని ప్రశ్నించారు. విలువైన ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ అంశంపై గతంలోనే తహసీల్దార్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్కు ఫిర్యాదులు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన రాలేదన్నారు. ప్రజా ఆస్తుల పరిరక్షణలో కాంగ్రెస్ మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు.పేట పట్టణంలో భూ ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదులను అధికారులు సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ భూముల హద్దులను నిర్ధారించి, రికార్డులను ప్రజలకు స్పష్టంగా అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా 414 సర్వే నంబర్కు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, భూమి స్థితిగతులు, హద్దులపై అధికారికంగా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ చేపట్టి, ఆక్రమణలు నిజమని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చౌదరి ప్రకాష్ డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే సుమారు వెయ్యి మందితో తహసీల్దార్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయాలు ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.అయితే, 414 సర్వే నంబర్లోని భూమి ప్రభుత్వ భూమేనన్న అంశం, ఆక్రమణ ఆరోపణలు, భూమి విలువ వంటి విషయాలపై సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉందన్నారు. త్వరలోనే హైడ్రా అధికారులకు పిర్యాదు చేయనున్నామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్పంధించి విలువైన ప్రభుత్వం స్టలాలు కాపాడాలని కోరారు.

# అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు అండగా టిడబ్ల్యూజేఎఫ్

- **వర్కింగ్ జర్నలిస్టుల ప్రాథమిక హక్కు అక్రెడిటేషన్ కార్డ్**
- **ఫెడరేషన్ సహకారంతోనే అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఫ్రీ లాన్స్ అక్రిడిటేషన్ కార్డులు**
- **జర్నలిస్టులకు ఫ్రీ లాన్స్ అక్రెడిటేషన్ కార్డుల అందజేత**
- **టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఖదీర్**



**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** సమాజ శ్రేయస్సు కోసం ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ, నిరంతరం పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఎల్లప్పుడూ తమ యూనియన్ టిడబ్ల్యూజేఎఫ్ అండగా ఉంటుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ అన్నారు. శనివారం ఖమ్మంలో వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులకు అర్హత ఉన్నప్పటికీ వారు అక్రెడిటేషన్ కార్డు దరఖాస్తు చేసుకోవడంలోనూ ఆన్లైన్ ఇతర అంశాలలో వారికి అవగాహన కల్పించి, అర్హత ఉన్న ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అండగా ఉంటూ శనివారం ఫ్రీ లాన్స్ అక్రిడిటేషన్ కార్డులు ప్రభుత్వం మంజూరు చేయగా వాటిని టి డబ్ల్యూ జె ఎఫ్ ఖమ్మం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న కొరకొప్పుల రాంబాబు, యూనియన్ జిల్లా నాయకులు కృష్ణమాచార్యులకు ఫ్రీ లాన్స్ అక్రిడేషన్ కార్డులను అందజేసి మాట్లాడారు. వివిధ పత్రికలలో వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డు వారి ప్రాథమిక హక్కు అని ఆయన అన్నారు. తమ యూనియన్ ఫెడరేషన్ సహకారంతోనే అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఫ్రీ లాన్స్ అక్రిడిటేషన్ కార్డులు దక్కాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు షేక్ జానిపాషా, లక్ష్మారెడ్డి, చౌదరి తదితరులు పాల్గొన్నారు..

# జన్మదిన సందర్భంగా ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకున్న కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు



**సదాశివపేట, ఆగస్టు 1, నేటి శుభోదయ :** సదాశివపేట మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు తన జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాత ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సదాశివపేట పట్టణం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. ఇట్టి సందర్భంగా పులిమామిడి మమత మాట్లాడుతూ ఆశాడ మాసంలో అమ్మవారి ఉత్సవాలలో భాగంగా తన పుట్టినరోజు రావడం ఎంతో సంతోషంగా ఉందని వారి అభిప్రాయాన్ని తెలియపరిచారు. వర్షాలు సకాలంలో పడి పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వన దుర్గ మాతను కొరుకున్నానని తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు కుటుంబ సభ్యులు అంజలి నాగరాజ్, సాయి, మధు, పద్మ, అఖిల్, సోమశంకర్ తదితరులు పాల్గొన్నారు.జన్మదిన సందర్భంగా పులిమామిడి మమతకు 12వ వార్డు ప్రజలు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేసి, ఆమె ప్రజాసేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# సంగారెడ్డి మెడికల్ కాలేజీ హాస్టల్‌లో నాసిరకం భోజనం.. వంటగదిలో పురుగులు, అపరిశుభ్రత

- **బ్యాన్ చేసిన కంపెనీ పాలు సరఫరా చేశారన్న ఆరోపణలు**
- **ఫుడ్ సేఫ్టీ తనిఖీలతో వెలుగులోకి వచ్చిన విస్తుపోయే వాస్తవాలు**
- **కాంట్రాక్టర్‌పై భారీ జరిమానాకు రంగం సిద్ధం**
- **అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?**



**సంగారెడ్డి , ఆగస్ట్ 01,, నేటి శుభోదయ :** ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన వైద్యులను తయారు చేసే మెడికల్ కాలేజీలోనే విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం జరుగుతోందా? విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతపై తీవ్ర ఆరోపణలు రావడంతో సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ హాస్టల్లో వెలుగుచూసిన పరిస్థితులు ఈ ప్రశ్నకు తావిస్తున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి అమృతవల్లి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో పలు విస్తుపోయే విషయాలు బయటపడినట్లు సమాచారం. విద్యార్థులకు వంట చేస్తున్న వంటగది అపరిశుభ్రంగా ఉండటంతో పాటు, వంటకు వినియోగించే రవ్వలో పురుగులు, బొద్దింకలు కనిపించినట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహించాల్సిన ఆహార తయారీ ప్రక్రియలో ఇలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.ఇక విద్యార్థులకు సరఫరా చేస్తున్న పాల విషయంలోనూ నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిషేధిత కంపెనీకి చెందిన పాలను విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తనిఖీల్లో గుర్తించినట్లు సమాచారం. దీంతో ఆహార సరఫరా కాంట్రాక్టర్ పనితీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కాంట్రాక్టర్ తప్పిదమేనా? అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?ఈ వ్యవహారంలో కేవలం కాంట్రాక్టర్ను మాత్రమే బాధ్యుడిగా చేసి చేతులు దులుపుకోవడం సరిపోదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హాస్టల్లో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు భోజనం చేస్తుంటే.. వంట సామగ్రి నాణ్యతను, వంటగది పరిశుభ్రతను, ఆహార భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై కూడా ఉంది.అయితే ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించే వరకు ఈ లోపాలు అధికారుల దృష్టికి రాకపోవడం పలు ప్రశ్నలకు దారితీస్తోంది. వంటగది పరిశుభ్రత ఇంత దారుణంగా ఉంటే ఇంతకాలం పర్యవేక్షణ వ్యవస్థ ఏం చేస్తోంది? విద్యార్థులకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నారా? కాంట్రాక్టర్ సరఫరా చేస్తున్న వస్తువులపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.భవిష్యత్ వైద్యులకే నాసిరకం భోజనం.. ఇది ఎంతవరకు సమంజసం?మెడికల్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులే రేపటి వైద్యులు. సమాజంలోని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన వైద్యులకు నాణ్యమైన ఆహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అలాంటి విద్యార్థులకు పురుగులు, బొద్దింకలు ఉన్న ఆహార పదార్థాలు వినియోగించే పరిస్థితి రావడం వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేస్తోంది.ఆహార నాణ్యత లోపం కారణంగా విద్యార్థులు అనారోగ్యానికి గురైతే దానికి బాధ్యత ఎవరిది? ముందస్తు పర్యవేక్షణ ఎందుకు జరగలేదు? విద్యార్థుల ఫిర్యాదులను అధికారులు ఎంతవరకు పరిగణనలోకి తీసుకున్నారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.జరిమానాతో సమస్య పరిష్కారం కాదుకాంట్రాక్టర్పై లక్షల రూపాయల వరకు జరిమానా విధించడం ఒక్కటే పరిష్కారం కాదు. అసలు లోపం ఎక్కడ జరిగింది? నాసిరకం ఆహార పదార్థాలు ఎలా హాస్టల్లోకి వచ్చాయి? వాటిని ఎవరు అనుమతించారు? నిషేధిత కంపెనీ పాలు సరఫరా చేస్తున్న విషయం అధికారుల దృష్టికి ఎందుకు రాలేదు? అనే అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ జరగాలి.అవసరమైతే కాంట్రాక్టర్ను బ్లాక్లిస్ట్లో పెట్టడంతో పాటు, నాణ్యతా ప్రమాణాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో హాస్టల్ ఆహార సరఫరా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి, ప్రతిరోజూ నాణ్యతా తనిఖీలు నిర్వహించేలా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి.వైద్యులను తయారు చేసే విద్యాసంస్థలో విద్యార్థుల ఆరోగ్యమే ప్రశ్నార్థకమైతే.. అది కేవలం ఒక కాంట్రాక్టర్ వైఫల్యం కాదు. మొత్తం పర్యవేక్షణ వ్యవస్థ వైఫల్యానికి అద్దం పడుతుంది. ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీతో బయటపడిన ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# తాళ్ల రామడుగు సీతారామచంద్ర స్వామి ఆలయంలో వైభవంగా శనివారం అన్నదాన కార్యక్రమం



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఆగస్టు 01, నేటి శుభోదయ :** సిరికొండ మండలం లోని తాళ్ల రామడుగు గ్రామ శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతి శనివారం క్రమం తప్పకుండా నిర్వహించే నిత్య అన్నసత్ర కార్యక్రమంలో భాగంగా ఈ వారం అన్నదాన కార్యక్రమాన్ని నాంపల్లి చిన్న బాలయ్య తాళ్ల రామడుగు నిర్వహించారు.ఈ సందర్భంగా దాత నాంపల్లి చిన్న బాలయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు స్వయంగా అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ... ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం అత్యంత పవిత్రమైన సేవ అని, ప్రతి శనివారం ఆలయంలో ఈ రకమైన అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి కోశాధికారి నక్క రాజేందర్, ఉపాధ్యక్షులు పెండ్లి రాజేశ్వర్,బెల్దారి నరేష్, బీరయ్య,గ్రామానికి చెందిన పలువురు భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు విశేష సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు..

## ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి వాక్యాలు ఉపసంహరించుకోవాలి

### : ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బూర మనోజ్



**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :**
తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఇటీవల ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల ఉపాధి అర్హతలపై మాట్లాడే క్రమంలో వారిని క్రిమినల్ వేస్ట్ అని సంబోధిస్తూ చేసిన వాక్యాలను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బూర మనోజ్ తీవ్రంగా ఖండించారు. ఒక ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇటువంటి వాక్యాలు చాలా దురదృష్టకరమని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది ఇంజనీరింగ్ విద్యార్థులు క్రియేట్ లో వారి తల్లిదండ్రులు అధ్యాపకులు, విద్యా సంస్థల మనోధైర్యాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ఒకవైపు జెన్ జీ యువతకు గౌరవం ఇవ్వాలని, వారి ప్రతిభను వినియోగించుకోవాలని చెబుతూ, మరోవైపు ఇంజనీరింగ్ విద్యార్థులను కించపరిచేలా మాట్లాడడం ఆయన ద్వంద వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ఇంజనీరింగ్ విద్యార్థులు దేశ అభివృద్ధికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను సంపాదించేందుకు కష్టపడుతున్నారని, అలాంటి విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ కళాశాలల పరిస్థితికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఉన్నత విద్య శాఖలో పర్యవేక్షణలో లోపాలు , సరైన తనిఖీలు లేకపోవడం వలనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, ఇంజనీరింగ్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టాలని మనోజ్ డిమాండ్ చేశారు.

## హోన్నజిపేట్‌లో పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్ల పంపిణీ



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, ఆగస్టు 01, నేటి శుభోదయ :**
వర్షాకాలంలో గ్రామ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ధర్పల్లి మండలం హోన్నజిపేట్ గ్రామంలో శనివారం పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ఆశవ్వ బాబయ్య చేతుల మీదుగా కార్మికులకు ఈ రెయిన్‌క ోట్లను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... వర్షాలను సైతం లెక్కచేయకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. వారి ఆరోగ్య పరిరక్షణ మరియు సౌకర్యం కోసమే ఈ సహాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురేందర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి గంగాధర్, వార్డు సభ్యులు రాఘవేందర్, బాలయ్య, అనిల్, గంగారాం, మల్లేష్, పద్మ, లలిత, లావణ్య, రూప లావణ్యలతో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన గ్రామ సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, ఆగస్టు 01, నేటి శుభోదయ :**
ధర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని గ్రామ సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్ శనివారం సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ శశాంక్, ఉపసర్పంచ్ ఎజ్జ శ్రీకాంత్, గ్రామ కార్యదర్శి రాకేష్, వీడీసీ ఛైర్మన్ ఆర్మూర్ రంజిత్, విష్ణు, హెడ్ నర్సులు జారీనా, రత్నకుమారి, స్టాఫ్ నర్సులు అరుణ, సుజన, ముంతాజ్, సిబ్బంది మురళి, సురేష్, పద్మ, మీనా మరియు ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## నూతన కమిటి అభినందించిన డిపో మేనేజర్ శివ ప్రసాద్



**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :**
ఖమ్మం డిపో ఎంప్లాయిస్ యూనియన్ గ్యారేజీ సెక్షన్ నుండి నూతనంగా ఏర్పాటైన కమిటీని డిపో మేనేజర్ శివ ప్రసాద్ ని, ఎంఎఫ్ ప్రవీణ్ కుమార్ ని, సీఐ గౌతమి నీ సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ ని, పరిచయ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన గ్యారేజీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కార్మికుల సమస్యలను తమ దృష్టికి తీసుకొని వస్తే వారి సమస్యలను పరిశీలించి పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన క్యారేజీ కార్యదర్శి కి కమిటీకి గౌరవ డిపో మేనేజర్ అసిస్టెంట్ మేనేజర్, మెకానికల్ ఇంజనీర్, హెడ్ కానిస్టేబుల్ లు శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్యారేజీ కార్యదర్శి ముల్లగిరి విజయభాస్కర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన గ్యారేజీ కార్యదర్శిగా నాకు బాధ్యతలు ఇచ్చిన ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీకి, రీజియన్ కమిటీకి, ఖమ్మం డిపో కమిటీకి ఎంప్లాయిస్ యూనియన్ గ్యారేజీ కార్మికులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసి కార్మికుల సమస్యలను డిపో మేనేజర్, మెకానికల్ ఫోర్ మెన్ దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరిస్తానని తెలియజేశారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు , ఖమ్మం రీజియన్ అధ్యక్షులు బి.ఎస్. రెడ్డి, రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్ , ఖమ్మం డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ పెదపాక వెంకటేశ్వర్లు, డిపో కోశాధికారి దామాల లాజర్, గ్యారేజీ నాయకులు ఆదినారాయణ మూర్తి, ఎం రవి, నరసింహారావు, హరిబాబు, సుధాకర్, రజాక్, డి. నాగేశ్వరావు, రమేష్ బాబు, బి. వెంకటేశ్వర్లు, సునీల్, జి.ఆర్.సి రెడ్డి. రవీందర్, రామకృష్ణ,రిషికేశ్ , రవి తదితరులు పాల్గొనడం జరిగింది.

## భద్రాచలం వద్ద ఉధృతమైన గోదావరి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
- ఉదయం 11- మధ్యాహ్నం 1 గంటల మధ్య 56.10 అడుగులకు నీటిమట్టం చేరి..మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండడంతో ఉన్నతాధికారులకు పలు సూచనలు



**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :**
ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో భద్రాచలం వద్ద గోదావరి నది మరింత ఉగ్రరూపం దాల్చిన నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సూచించారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట సమయం దాకా గోదావరి వరద ఉధృతి 56.10 అడుగులుగా, 15,96,899 క్యూసెక్కులుగా, మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న విషయం తెలుసుకుని.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్లో మాట్లాడి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రాణనష్టం జరగకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని కోరారు. --- జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా అత్యవసర సమీక్ష భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ లతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి తాజా పరిస్థితులపై ఎంపీ రఘురాం రెడ్డి ఆరా తీశారు. గోదావరి వరద ఉధృతి, సహాయక చర్యల తీరుపై చర్చించి సూచనలు చేశారు.నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున కరకట్టల వెంబడి, లీకేజీలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో సంబంధిత సిబ్బంది ద్వారా నిరంతరం గస్తీ నిర్వహించాలని ఆదేశించారు.--- ఏజెన్సీలో రాకపోకలు నిలిచిపోయిన ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ రవాణా మరియు అత్యవసర సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. నిర్వాసితులకు తాగునీరు, వైద్యం, భోజన వసతి సక్రమంగా అందేలా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు.

## స్నేహం మానవత్వానికి చిరునామా జీవితానికి చిరస్థాయి బలమైన బంధం

- స్నేహ దినోత్సవ శుభాకాంక్షలు
- డాక్టర్ కాపా మురళి కృష్ణ



**వైరా , నేటి శుభోదయ :**
స్నేహం అనేది జీవితాన్ని ఆనందమయం చేసే అమూల్యమైన అనుబంధమే కాకుండా సమాజంలో మానవీయ విలువలను పరస్పర విశ్వాసాన్ని పెంపొందించే గొప్ప అరుదైన బంధం అని ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు ఆదివారం అంతర్జాతీయ స్నేహ దినోత్సవం ఆగస్టు ఫస్ట్ సందర్భంగా చిరుకాల మిత్రులకు విద్యార్థులకు మిత్రులకు శ్రేయోభిలాషులకు పట్టణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ నిజమైన స్నేహం కష్టకాలంలో తోడుగా నిలిచి మనిషికి ధైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుందన్నారు స్నేహ బంధాలు కుటుంబాల మధ్య సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఐక్యతను పెంపొందించి శాంతియుత వాతావరణం నెలకొల్పడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు విద్యార్థి దశలో ఏర్పడే నుంచి స్నేహాలు వ్యక్తిత్వం వికాసానికి బలమైన పునాదిగా నిలుస్తాయని విద్యతో పాటు క్రమశిక్షణ పరస్పర గౌరవం సహకార భావనలు అలవర్చుకోవాలని సూచించారు నేటి డిజిటల్ యుగంలో ప్రత్యక్ష మానవ సంబంధాలు ఆప్యాయత పరస్పర ఆదరణ మరింత అవసరమని డాక్టర్ కాపమురళీకృష్ణ ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ప్రేమ స్నేహం సేవాభావాన్ని జీవితంలో భాగంగా చేసుకుని సమాజ అభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ అంతర్జాతీయ స్నేహ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు ప్రతి కుటుంబంలో ఆనందం ప్రతి స్నేహబంధం లో విశ్వాసం ప్రతి జీవితంలో విజయాలునిండాలని ఆకర్షించారు

## గోదావరి వరద నివారణలో ప్రభుత్వాల ఉదాసీన వైఖరిని ప్రజలు గమనించాలి

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్
- పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో భద్రాచలం ప్రాంతానికి ముంపు
- ఈ అంశంపై అనేకసార్లు పోరాటం చేశానన్న మాజీ మంత్రి పువ్వాడ



**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :**
భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం కనిపిస్తున్న గోదావరి వరద ఉధృతి సహజ పరిసితుల వల్ల మాత్రమే కాదని, దిగువన ఆంధ్ర ప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావం కూడా ప్రధాన కారణమని ప్రజలు గమనించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా భద్రాచలం, దాని పరిసర గ్రామాల్లో ముంపు సమస్య మరింత తీవ్రరూపం దాల్చిందని వరదలు వచ్చిన ప్రతిసారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.పోలవరం ముంపు సమస్యపై తాను మంత్రిగా బీఆర్ఎస్ పార్టీ తరపున తొలి నుంచి నిరంతరం పోరాటం చేశానని తెలిపారు. గతంలో అనేక వేదికలపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణ ప్రజల పక్షాన బలంగా గళం వినిపించానని గుర్తుచేశారు. భద్రాచలం ప్రాంత ప్రజల ప్రయోజనాల పరిరక్షణలో బీఆర్ఎస్ ఎప్పటికీ రాజీపడదని స్పష్టం చేశారు.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం బాధ్యతలు నెట్టేసుకునే ధోరణిని విడనాడి, పోలవరం బ్యాకవ ాటర్ ప్రభావంపై సమగ్ర అధ్యయనం నిర్వహించి, భద్రాచలం పరిసర ప్రాంతాలకు శాశ్వత ముంపు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వరదల సమయంలో తాత్కాలిక సహాయక చర్యలకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో ముంపు సమస్య పునరావృతం కాకుండా శాశ్వత కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని కోరారు.

## పాత కూరగాయల మార్కెట్ రోడ్డు మరమ్మత్తులను పరిశీలించిన కౌన్సిలర్

- వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి
- చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ

**వైరా, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని పాత కూరగాయల మార్కెట్ రోడ్డు మరమ్మత్తు పనులను శనివారం 5వ వార్డు కౌన్సిలర్ కట్టాస్వరూపరాణిపరిశీలించారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులతో పరిశీలించి రోడ్డు మరమ్మత్తు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు తాను ఎప్పటికప్పుడు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు..5 వ వార్డు లో మరమ్మత్తు పనులను సంబంధిత అధికారులతో కలిసి ఈరోజు మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ పరిశీలించారు. అన్ని వార్డులో అభివృద్ధి పథంలో నడిపించేందుకే కృషి చేస్తామని ఆమె తెలిపారు





## మత్తు పదార్థాల రహిత భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### -జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి రామారావు

**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి రామారావు పిలుపునిచ్చారు.వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో సిబ్బందిచేవికసిత భారత్ కోసం మత్తు పదార్థాలు లేని యువత కోసం ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా డి ఎం అండ్ హెచ్ ఓ రామారావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశాభివృద్ధిపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. పొగాకు, మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్, కాలేయ వ్యాధులు, మానసిక సమస్యలు వంటి అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వివరించారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం దృష్టి పెట్టాలని, పాఠశాలలు, కళాశాలలు, గ్రామస్థాయి సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు."మత్తు పదార్థాలకు 'నో' చెప్పండి – ఆరోగ్యకరమైన జీవితానికి 'యెస్' చెప్పండి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని కోరారు. మత్తు పదార్థాల రహిత భారత నిర్మాణం ప్రతి పౌరుడి బాధ్యత అని




పేర్కొంటూ, యువత దేశ భవిష్యత్తు అని, వారి ఆరోగ్యం మరియు భవిష్యత్తును కాపాడేందుకు సమాజంలోని ప్రతి వర్గం కలిసి పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎల్ ప్రవీణ అడిషనల్ డిఎమ్ అండ్ హెచ్ ఓ, ఎల్ వేణుగోపాల్ రెడ్డి, పి ఓ ఎం హెచ్ ఎన్, డాక్టర్ ఏ అరుణాదేవి, పి ఓ ఎన్ పి ఎన్ సీ డి,డాక్టర్ ఐ మోత్యా, పి ఓ ఐ డి ఎస్ పి, డెమో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ డెమో వెంకటేశ్వరరాజు, డిపిహెచ్ఎన్ఓ శేషు పద్మ, ఆఫీస్ సూపర్డెంట్ రవికుమార్, ఉపేందర్, ఎస్ఓ వీరన్న డి డి ఎం నాగరాజు బిఎస్ఓ వేణుమాధవ్ డిడిఎం కృష్ణమోహన్, డిపిఎమ్ఓ కృష్ణమూర్తి, హెచ్ ఈ ఓ పుల్లయ్య సత్యనారాయణ,హెల్త్ఎడ్యుకేటర్స్ ఖాదర్ బి గీత మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ఖమ్మం అభివృద్ధికి కేంద్రం పెద్దపీట

- మోదీ, గడ్కరీ చిత్రపటాలకు పాలాభిషేకం
- అట్టహాసంగా ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రారంభం
- కృతజ్ఞతలు తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్ హైవేను ప్రారంభించిన సందర్భంగా ఖమ్మం జిల్లాలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి. కేంద్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లా ప్రగతికి పెద్దపీట వేస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ప్రధాని మోదీ, కేంద్ర జాతీయ రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీల చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత దేశం విశ్వగురువుగా, ఆర్థిక వ్యవస్థలో అగ్రగామిగా నిలబడుతోందని కొనియాడారు. దేశ ప్రగతితో పాటు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం, ముఖ్యంగా ఖమ్మం జిల్లా కోసం కేంద్రం విశేషంగా కృషి చేస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'భారతమాల పరియోజన' ప్రాజెక్టు కింద మంజూరైన తల్లంపాడు–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేతో పాటు, నాగపూర్–అమరావతి హైవేలు ఖమ్మం జిల్లాకు కేంద్రం ఇచ్చిన 'వరమాల'గా ఆయన అభివర్ణించారు.సుమారు రూ. 3,700 కోట్లకు పైగా భారీ వ్యయంతో నిర్మిస్తున్న/నిర్మించిన ఈ




గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారుల వల్ల జిల్లా రవాణా స్వరూపం పూర్తిగా మారిపోతుందన్నారు. ఇవి జిల్లాలో పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ కలను సాకారం చేస్తూ, ఇంతటి భారీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినందుకు ఖమ్మం జిల్లా ప్రజల పక్షాన, భారతీయ జనతా పార్టీ తరఫున ప్రధాని మోదీకి, మంత్రి నితిన్ గడ్కరీకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి శ్రీరామ నేనిమణి, మహిళా మోర్చా అధ్యక్షురాలు మంద సరస్వతి, నాయకుడు రవి రాథోడ్, రీగన్ ప్రతాప్... బీజేవైఎం నాయకులు, స్థానిక బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పాత కూరగాయల మార్కెట్ రోడ్డు మరమ్మత్తులను పరిశీలించిన కౌన్సిలర్

- వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి
- చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ

**వైరా, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని పాత కూరగాయల మార్కెట్ రోడ్డు మరమ్మత్తు పనులను శనివారం 5వ వార్డు కౌన్సిలర్ కట్టాస్వరూపరాణిపరిశీలించారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులతో పరిశీలించి రోడ్డు మరమ్మత్తు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టిన



మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు తాను ఎప్పటికప్పుడు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు..

## కొండూర్ హై లెవెల్ బ్రిడ్జిని పరిశీలించిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి

**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఆగస్టు 01, నేటి శుభోదయ :** గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న సిరికొండ మండలం కొండూర్ గ్రామంలోని 'హై లెవెల్ బ్రిడ్జి'ని నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.బ్రిడ్జి వద్ద దెబ్బతిన్న ప్రాంతాలను, ప్రస్తుత పరిస్థితిని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వర్షాల వల్ల జరిగిన నష్టంపై అధికారుల నుంచి ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ:"భారీ వర్షాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే తొలగించాలి. ప్రజలు మరియు వాహనదారుల రాకపోకలకు ఎలాంటి అవరోధం కలగకుండా తక్షణమే అవసరమైన పునరుద్ధరణ, మరమ్మతు పనులు ప్రారంభించాలి. రాకపోకలు సాఫీగా కొనసాగేలా సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలి." అని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.





## సదరం–యూడీఐడీ కార్డుల జారీని వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం–యూడీఐడీ కార్డులు అందేలా చర్యలు
- సదరం–యూడీఐడీ కార్డుల జారీపై సెర్ప్ సీఈఓ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం–యూడీఐడీ కార్డులు సకాలంలో అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం సెర్ప్ సీఈఓ దివ్య సదరం–యూడీఐడీ కార్డుల జారీ పురోగతిపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారులు, ముఖ్య వైద్యాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.సదరం–యూడీఐడీ కార్డుల జారీ పురోగతి, జిల్లాల వారీగా నమోదవుతున్న దరఖాస్తులు, పెండింగ్ కేసులు, కేంద్రాల పనితీరు, మౌళిక వసతులపై సెర్ప్ సీఈఓ వీసీ ద్వారా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లాకలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వం సదరం– యూడీఐడీ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులలో అర్హులైన వారందరికీ సదరం ధృవపత్రాల జారీని వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం– యూడీఐడీ కార్డులు అందేలా క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలని సూచించారు. జిల్లాలో యూడీఐడీ మూల్యాంకన కేంద్రంలో అవసరమైన పరికరాలు, స్పెషలిస్ట్ వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన సదరం కేంద్రం వల్ల ప్రక్రియ మరింత క్రమబద్ధీకరించ బడిందని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సకాలంలో సదరం– యూడీఐడీ ధృవ పత్రాలు జారీకి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, డిఆర్డిఓ శ్రీరామ్, సిపిఓ శ్రీనివాస్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## బురదమయమైన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు

- పరిశీలించినచైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రక



**వైరా, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని అంతర్గత రోడ్ల అభివృద్ధి, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో మరమ్మతులు జరుగుతున్న 5 వ వార్డు కూరగాయల మార్కెట్ రోడ్డు12 వ వార్డ, వాసవి కళ్యాణ మండపం రోడ్డును ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఏఈ శ్రీమన్యాకు పలు సూచనలు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న రోడ్లను పరిశీలించి ప్రాధాన్యత ఆధారంగా గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే మున్సిపాలిటీలోని అన్ని అంతర్గత రోడ్లను దశలవారీగా మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రామచంద్రరావుకు సూచించారు ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ, గత రెండు రోజులుగా కురిసిన ఎడతెరిపిలేని వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో రోడ్లు బురదమయంగా మారి ప్రజలు తీవ్రఇబ్బందులుఎదుర్కొన్నారని చెప్పారు. విషయం తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులను అప్రమత్తంమరమ్మతుపనులుప్రారంభించాలని ఆదేశించామని తెలిపారు. ప్రస్తుతం బురదగా మారిన రోడ్లపై ఎస్‌డస్ట్, కంకర వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్లు వెల్లడించారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పాలన కొనసాగిస్తామని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## సిపిఐ సభ్యులు ఒక్కరోజు శిక్షణను జయప్రదం చేయాలని పిలుపు



**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ సభ్యుల కోసం ఒక్కరోజు నిర్వహించనున్న శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఆదివారం ఉదయం 9 గంటలకు ముత్తగూడెం మెయిన్ రోడ్డులోని అనుముల రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. పార్టీ చరిత్ర, కమ్యూనిస్టు ఉద్యమ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై పార్టీ నిబద్ధత, ప్రజలతో మమేకమై పనిచేసే విధానం, కమ్యూనిస్టు కార్యకర్త ఎలా ఉండాలనే అంశాలపై సీనియర్ నాయకులు సమగ్రంగా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, కార్యకర్తల రాజకీయ అవగాహన పెంపొందించడానికి ఈ శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని, అందువల్ల మండలంలోని పార్టీ సభ్యులు, నాయకులు అందరూ తప్పనిసరిగా హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా కవితా కళాశాల లో ఆషాడ మాస వేడుకలు




**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** ఆషాడ మాస సందర్భాన్ని పురస్కరించుకొని కవితా మెమోరియల్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల లో గోరింటాకు ఉత్సవాన్ని ఆనందోత్సవాల మధ్య నిర వ్యహించారు. కంప్రదాయ కళాశాల లెక్చరర్లు విద్యార్థినిలు సంప్రదాయ వస్త్రాలను ధరించి గోరింటాకు పత్రాలను సంప్రదాయ బద్ధమైన రోకలిలో దంచి నా గోరింటాకు మిశ్రమాన్ని కళాశాలలోని ఉపాధ్యాయురాళ్లు విద్యార్థినిలు చేతులు పండే విధంగా రాసుకొని సంప్రదాయ బద్ధంగా ఆషాడమాస గోరింటాకు వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బోటనీ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్. ఎస్ గీత. కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్. బి గీత గణిత శాస్త్ర విభాగా దిపతి పద్మావతి. లెక్చరర్లు వంశీ ప్రియా ఉషారాణి ఉమారాణి. రోజా. మేఘన. సాయి శివాని. ప్రియం వద. శశికళ. మౌనిక స్రవంతి. శైలజ. ఆశా బేగం తో పాటు 200 మంది విద్యార్థినిలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు

### -మంథని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మల్లాది అపర్ణ



**మంథని, ఆగష్టు-01, నేటి శుభోదయ :** విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మంథని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మల్లాది అపర్ణ హెచ్చరించారు. మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం జేఎన్‌టీయూ మంథని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ర్యాగింగ్ వ్యతిరేక న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యూజీసీ మార్గదర్శకాల ప్రకారం దేశంలోని అన్ని విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను పూర్తిగా నిషేధించారని ఆమె తెలిపారు. కళాశాల ప్రాంగణంలోనే కాకుండా బయట కూడా తోటి విద్యార్థులను మానసికంగా లేదా శారీరకంగా వేధించడం చట్టరీత్యా నేరమనీ, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన శిక్షలు విధించబడతాయని స్పష్టం చేశారు. ర్యాగింగ్ అనేది అమానవీయమైన, అనైతికమైన చర్య అని, భారతీయ సంస్కృతి పరస్పర గౌరవం, సహనం, సోదరభావాన్ని బోధిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చట్టాలను గౌరవిస్తూ సత్ప్రవర్తనతో ఆదర్శ పౌరులుగా ఎదగాలని సూచించారు.బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె. రఘోతం రెడ్డి మాట్లాడుతూ, ర్యాగింగ్ సమాజానికి హానికరమైన దురాచారమని, ప్రతి విద్యార్థి ఇతరుల హక్కులను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ మంచి విలువలతో విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర సుధారాణి, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అనురాధ, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కటకం శ్రీనివాస్, న్యాయవాదులు శశిభూషణ్ కాచె, నూనేటి ఆంజనేయులు, సీఐ బుద్దే స్వామి, ఎస్ఐ టి. శ్రీనివాస్, హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సువర్ణ ప్రణీత్, జేఎన్‌టీయూ ఫిజికల్ డైరెక్టర్ పింగిలి కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్ -XII విజయవంతం

### : పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్–XII' విజయవంతంగా ముగిసిందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. జులై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ మొత్తం 122 మంది చిన్నారులను రక్షించారన్నారు. వీరిలో 110మంది బాలురు, 12 మంది బాలికలు ఉన్నారన్నారు. ఆపరేషన్ ముస్కాన్లో భాగంగా తెలంగాణకు చెందిన 69 మంది చిన్నారులను రెస్క్యూ చేయగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన 53 మంది చిన్నారులను గుర్తించారని వెల్లడించారు. ఆపరేషన్‌లో భాగంగా ఖమ్మం పోలీసులు, కార్మిక శాఖ, డీసీపీయూ, సీడబ్ల్యూసీ, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారని, పరిశ్రమలు, కంపెనీలు, దుకాణాలు, హోటళ్లు, నిర్మాణ ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో సోదాలు చేపట్టారన్నారు. తనిఖీల్లో బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న పిల్లలను, ఇతర ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను గుర్తించి రక్షించారని తెలిపారు.రక్షించిన చిన్నారుల వివరాలను దర్పణ్ యాప్‌లో పోలీసులు నమోదు చేశారని అన్నారు.53 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు అయినట్లు తెలిపారు. అదే విదంగా 103 మంది పిల్లలను వారి కుటుంబ సభ్యులందరికీ అప్పగించడం జరుగుతుందని, 19 మంది పిల్లలను బాలల సంరక్షణ గృహంలో ఉంచడం జరిగిందన్నారు.తప్పిపోయిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చే లక్ష్యంతో పోలీసులు ఆపరేషన్ ముస్కాన్ చేపట్టినట్లు తెలిపారు. చిన్నారుల భద్రతే లక్ష్యంగా నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

## తెలంగాణ రైతాంగ పోరాట దళ నాయకుడు-కామ్రేడ్ కృష్ణమూర్తి 20వ వర్ధంతి

- సిపిఐఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య
- కామ్రేడ్ కృష్ణమూర్తికి పార్టీ శ్రేణులు ఘన నివాళి అర్పించారు






**ఇబ్రహీంపట్నం,ఆగస్టు 1, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఈ ప్రాంత ఉద్యమ నిర్మాత కామ్రేడ్ కాంచం కృష్ణమూర్తి 20వ వర్ధంతి ఇబ్రహీంపట్నం పాషా, నరహరి స్మారక కేంద్రం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రాచకొండ కేంద్రంగా వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, దున్నేవాడికే భూమి అనే నినాదంతో ఇబ్రహీంపట్నం తాలూకాలో దొరలు, భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి వందల ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేశారని, రాచకొండ పరిసర ప్రాంతాల ప్రజలు కృష్ణమూర్తి గారిని ప్రేమతో "రాగన్న" అని పిలిచేవారని అన్నారు. ఈ ప్రాతంలో ఉద్యమానికి నాయకత్వం వహించారని అన్నారు.ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించాలని రోజు వారి వేతనం రూ. 600 వందలు చెల్లించాలని, మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, విక సీత్ భారత్ గ్రామ్ విబిజి రాం జీ చట్టాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. సామెల్, ఎం. చంద్రమోహన్, డి. జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు రావుల జంగయ్య, అలంపల్లి నర్సింహా,సి.హెచ్. జంగయ్య,డి. కిషన్, మున్సిపల్ కార్యదర్శి సి ఎచ్. ఏల్లేష్, నాయకులు అలేటి ఎల్లయ్య,కొంగారి కృష్ణ, పి.ఎన్. ఎం. జిల్లా అధ్యక్షురాలు కె. శారదా, సీఐటీయూ జిల్లా నాయకురాలు వై. స్వప్న, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ముసిలయ్య, అలంపల్లి జంగయ్య, చందు నాయక్, బోడ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐ, ఏటీసీ విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్,ప్లేస్‌మెంట్ జాబ్ మేళా : ప్రిన్సిపాల్ సక్రు

- ఆగస్టు 6న ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ, టేకులపల్లిలో నిర్వహణ
- ఖమ్మం, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యం
- అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** ప్రభుత్వ ఐటీఐ/అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ), టేకులపల్లి, ఖమ్మం ఆధ్వర్యంలో ఐటీఐ, ఏటీసీ విద్యార్థుల కోసం 100 శాతం అప్రెంటిస్‌షిప్, ప్లేస్‌మెంట్ జాబ్ మేళాను ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ, టేకులపల్లి ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ ప్రిన్సిపాల్ జి. సక్రు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఖమ్మం, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పరిశ్రమలు పాల్గొని అర్హులైన అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్‌తో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించ నున్నట్లు తెలిపారు. ఐటీఐ, ఏటీసీలో అర్హత సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం అప్రెంటిస్‌షిప్ అడ్వైజర్ జి. రవి (టి.ఓ.), ఖమ్మంను 9989637594 నంబర్‌లో సంప్రదించాలని ఆ ప్రకటనలో సూచించారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

- సెప్టెంబర్ ఒకటిన ఛలో ఢిల్లీ
- ఎన్ఎఫ్ఐడబ్ల్యూ కౌన్సిల్ సమావేశంలో లతాదేవి




**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అనుబంధం) జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి డిమాండ్ చేశారు. ఉచిత బస్సు తప్ప మహిళలకు ఇచ్చిన ఏ హామీని ప్రభుత్వం అమలు చేయలేదని ఆమె ఆరోపించారు. తెలంగాణ మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లతాదేవి మాట్లాడుతూ ప్రతి మహిళ ఖాతాలో –నెలకు రూ.2,500 జమ చేస్తామని, కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆడపిల్లలకు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని, ఎందుకు –అమలు చేయడం లేదని ఆమె ప్రశ్నించారు. విద్యను అభ్యసిస్తున్న యువతులకు స్కూటీలు సైతం అందిస్తామని చెప్పారని కానీ హామీల అమలు దిశగా కాంగ్రెస్ పాలన సాగడం లేదని లతాదేవి తెలిపారు. మహిళలను లక్షాధికారులను చేస్తాం, కోటీశ్వరులను చేస్తామని చెబుతున్నారు తప్ప "అది ఆచరణలో తద్ విరుద్ధ ఫలితాలు వస్తున్నాయని ఆమె తెలిపారు. వడ్డీ లేని రుణాలతో జరుగుతున్న అన్యాయాన్ని నిలువరించాలని ఆమె కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తుందని ముఖ్యంగా మహిళలను కించపరిచే రీతిలో బిజెపి అనుబంధ సంఘాల నాయకులు మాట్లాడుతున్నారని ఆమె తెలిపారు. అత్యాచార ఘటనకు సంబంధించి విశ్వ హిందూ పరిషత్ నాయకులపై కేసులు నమోదు చేయాలని మోహన్ దాస్ను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ వద్ద సెప్టెంబర్ ఒకటిన జరిగే ప్రజా ఆందోళనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు. మహిళా సమాఖ్య బలోపేతానికి కార్యాచరణ రూపొందించినట్లు –ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు పోటు కళావతి, కార్యనిర్వహక అధ్యక్షురాలు సిహెచ్ –సీతామహలక్ష్మి , సంఘ బాధ్యులు దండి శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# సురభి సంస్థ లోగోను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, ఆగష్టు-01, నేటి శుభోదయ :** 140 సంవత్సరాల చరిత్ర కలిగిన సురభి నాటక సంప్రదాయానికి చెందిన శ్రీ లక్ష్మీనరసింహా సాయి వెంకటేశ్వర నాట్యమండలి సురభి సంస్థ లోగోను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతికి ప్రతీకలైన ప్రాచీన కళారూపాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సుమారు 140 సంవత్సరాల చరిత్ర కలిగిన సురభి నాటక సంప్రదాయం తెలుగు కళా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని కొనియాడారు. ఇలాంటి గొప్ప కళాసంస్థ లోగోను ఆవిష్కరించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.సంప్రదాయ కళలను ప్రోత్సహించి భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. కళాకారులను ప్రోత్సహించడం ద్వారా సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ సేవా సదన్ అధ్యక్షుడు, మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి.ఎల్.ఎన్. (కర్ణె) హరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సాయేందర్ రెడ్డి, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాంచంద్రరావు, సురభి సంస్థ వ్యవస్థాపకుడు సురభి వెంకటేష్ ప్రసాద్, సింగరేణి రిటైర్డ్ డీజీఎం లక్ష్మీనారాయణ, వంగ రాజసమ్మయ్య, కొండ సమ్మన్న, శశి భూషణ్ కాచె, ప్రజాప్రతినిధులు, కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

# సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ తెరిపించే వరకు రైతు ఉద్యమం

## : ఆకుల పాపయ్య




**నిజామాబాద్ రూరల్ మోపాల్, ఆగస్టు 01, నేటి శుభోదయ :** గత 16 ఏళ్లుగా మూతపడిన ఎన్సీఎస్ఎఫ్ (NCSF) సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించే వరకు రైతులతో కలిసి ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య అన్నారు. శనివారం మోపాల్ మండలం కంజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ మూత పడటంతో నాలుగు నియోజకవర్గాల పరిధిలోని 110 గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రస్తుతం చెరుకు సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నందున ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు కేటాయించి ఫ్యాక్టరీని వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచి చెరుకు సాగును ప్రోత్సహించాలని కోరారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ, సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని పునఃప్రారంభించి ప్రభుత్వ ఆధ్వర్యంలో బెల్లం కేంద్రంగా నిర్వహించాలని కోరారు. ఈ విషయంలో బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు మాక్ ఎలక్షన్

- కాకతీయ హైస్కూల్‌లో వినూత్న కార్యక్రమం
- ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి




**మంథని, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు పెంపొందించడంతో పాటు ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించే లక్ష్యంతో కాకతీయ హైస్కూల్‌లో శనివారం మాక్ ఎలక్షన్‌ను నిర్వహించారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి తెలిపారు.భారత ఎన్నికల సంఘం నిర్వహించే ఎన్నికల మాదిరిగానే నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల ప్రచారం, రహస్య ఓటింగ్, బ్యాలెట్ బాక్స్ ద్వారా పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు అన్ని దశలను విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించారు.ఎన్నికల్లో హెడ్ బాయ్‌గా బి. కౌశిక్, హెడ్ గర్ల్‌గా విశ్వశ్రీ, స్పోర్ట్స్ సెక్రటరీగా ఓంకార్, డిప్యూటీ హెడ్ బాయ్‌గా శ్రీ నాగచైతన్య, డిప్యూటీ హెడ్ గర్ల్‌గా అంజలి ప్రియ ఎన్నికయ్యారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సామాజిక కార్యకర్త కనుకుంట్ల స్వామి భారత ఎన్నికల వ్యవస్థ, ఓటు హక్కు ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన ఓటరు విధులపై విద్యార్థులకు వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి పౌరుడు తన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ఈ మాక్ ఎలక్షన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఎన్నికల నిర్వహణ విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకుని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేందుకు అవసరమైన అవగాహన పొందారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మాక్ ఎలక్షన్‌ను విజయవంతం చేశారు.

# ఎంపీ వద్దిరాజుకు ఆహ్వానం



**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** కోకాపేటలో నిర్మిస్తున్న ఆత్మగౌరవ భవనం ప్రాంగణంలో కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ విగ్రహాన్ని నెలకొల్పేందుకు అనుమతి మంజూరు చేయాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్,ఎం.కే.ఫౌండేషన్ ఛైర్మన్ వద్దిరాజు రవిచంద్రను మున్నూరుకాపు ఆత్మగౌరవ మహా ధర్నసేన విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు ధర్నసేన రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్,కో–కన్వీనర్ అమరం శ్యాం కుమార్ లు ఎంపీ రవిచంద్రను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు.విద్యా,ఉద్యోగ రంగాలలో బీసీల రిజర్వేషన్ల కల్పనకు విశేష కృషి చేసిన స్వర్గీయ శివశంకర్ విగ్రహాన్ని నెలకొల్పేందుకు ఎంపీ రవిచంద్ర సానుకూలంగా స్పందించారు.దివంగత నాయకులు శివశంకర్ జయంతి సందర్భంగా ఆగస్ట్ 10వతేదీన (సోమవారం )జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావలసిందిగా శ్రీనివాస్ పటేల్, శ్యాం కుమార్ లు ఎంపీ వద్దిరాజును ఆహ్వానించారు.

# ఎస్ఐఆర్ అభియాన్ విజయవంతానికి బీఎల్ఏలతో బీజేపీ కీలక సమావేశం

- సిరికొండ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా కర్కా గంగారెడ్డి హాజరు – పార్టీ నాయకులకు దిశానిర్దేశం



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఆగస్టు 01, నేటి శుభోదయ :** సిరికొండ మండల కేంద్రంలో ఈరోజు ఎస్ఐఆర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ నాయకులు కర్కా గంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎస్ఐఆర్ అభియాన్ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులకు సూచనలు చేశారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాజేశ్వర్, మండల అధ్యక్షుడు గుర్రం సంజీవరెడ్డి, జిల్లా నాయకులు అల్లూరి రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి గంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మలోత్ రాజేందర్, యువ మోర్చా అధ్యక్షుడు మధు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రభాకర్, రంజిత్ రెడ్డి, గోపి, మండల కార్యదర్శులు సుమన్, శ్రీనివాస్, నరేశ్, ఈ. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రులను కలిసిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్



**నిజామాబాద్, ఆగస్ట్ 01 , నేటి శుభోదయ :** శనివారం నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాజెక్టును పరిశీలించేందుకు వచ్చిన రాష్ట్ర భారీ నీటిపారుదల,పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఐ.టీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు లను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం తెలిపిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య.

## 75 డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఒకరికి ఏడు రోజుల జైలు, 74 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి 10 వేలు జరిమానా విధించిన న్యాయమూర్తి

- ప్రాసిక్యూషన్ కు సహకరించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం, ఆగస్ట్ 01 , నేటి శుభోదయ :**
ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు చేసిన 75 డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులల్లో ఒకరికి ఏడు రోజుల జైలు శిక్ష, మరో 74 మంది వాహనదారులకు ఒక్కొరికి 10 వేల రూపాయల చొప్పున ఏడు లక్షల నలభై వేల రూపాయల జరిమానా విధిస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు గౌరవ న్యాయమూర్తి శ్రీమతి బి. నాగలక్ష్మి తీర్పు చెప్పారు.ఈ సందర్భంగా ఖమ్మం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీ బెల్లం సత్యనారాయణ గారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించి, సురక్షితమైన రహదారి ప్రయాణానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రాసిక్యూషన్ కు సహకరించిన అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## ఖమ్మం జిల్లాను అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి

### : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకు రావాలి
- పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్






**ఖమ్మం, ఆగష్టు-01, నేటి శుభోదయ :**
ఖమ్మం జిల్లాలోని చెరువులు, సరస్సులు, నదీ తీర ప్రాంతాలు సహా ప్రకృతి సిద్ధమైన నీటి వనరులను ప్రజలను ఆకర్షించే పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, జిల్లాను రాష్ట్రంలోనే అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలో చేపడుతున్న పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని చెరువులు, నీటి వనరుల వద్ద ప్రతిపాదించిన పర్యాటక అభివృద్ధి పనులు, మౌళిక సదుపాయాల కల్పన, అందుబాటు లో ఉన్న భూమి, వివిధ ప్రాజెక్టుల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా కలకోట, చింతకాని, ముత్తారం, చిరుమర్రి, బయ్యారం, మాటూరు లేక్, వైరా, పాలేరు రిజర్వాయర్, మధిర రివర్ ఫ్రంట్, ఇనియాద్రమ్మ, జమలాపురం, మామనురు లేక్, నేలకొండపల్లి బౌద్ధ స్థూపం పర్యాటక అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టే ప్రతి పర్యాటక అభివృద్ధి కార్యక్రమం నీటి వనరుల పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు అవసరమైన భూమి అందుబాటులో లేకపోతే ప్రత్యామ్నాయ ఇంజినీరింగ్ పరిష్కారాలను అన్వేషించాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.అవసరమైతే అభివృద్ధి కార్యక్రమాల కోసం భూసేకరణ చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు మెరుగైన పర్యాటక సదుపాయాలు కల్పించడంలో రాజీ పడబోమని పేర్కొన్నారు. మధిర రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనులు ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా, నాణ్యత తో చేపట్టాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులను పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి అనుసంధానం చేస్తూ ఉపాధి అవకాశాలు, స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా ప్రణాళికలు రూపొందించా లని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, టూరిజం ఎస్ఈ సరిత, జిల్లా టూరిజం అధికారి బి. సుమన్ చక్రవర్తి, టీజీటిడీసీ, సీపీఎస్‌ఏ ప్రతినిధులు ఎన్. రామకృష్ణ, ప్రవీణ్ కుమార్, స్మిత, హరికృష్ణ, ఎన్ఎస్ఎస్ సలావుద్దీన్, ఐ-క్యాడ్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నోటిఫికేషన్ల ఆలస్యంతో తీవ్ర మనస్తాపం

### -సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నిరుద్యోగి

**ఖమ్మం, ఆగస్ట్ 01 , నేటి శుభోదయ :**
ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా సిద్ధమవుతూ, వరుసగా పోటీ పరీక్షలు రాసిన ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన గడ్డం వేణు అను ఓ నిరుద్యోగ యువకుడు ప్రభుత్వ నోటిఫికేషన్లు సకాలంలో వెలువడకపోవడం, కుటుంబ పరిస్థితులు, వ్యక్తిగత సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తన లేఖలో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి ఉద్దేశించి సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆ లేఖలో వివరించాడు. లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం, చిన్నప్పటి నుంచే ప్రభుత్వ ఉద్యోగం లక్ష్యంగా గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ తదితర పరీక్షలకు సిద్ధమై పలుమార్లు పరీక్షలు రాశాడు. అయితే ఉద్యోగం దక్కక పోవడం, ప్రభుత్వ నియామక ప్రక్రియల్లో జాప్యం, కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, తల్లీ అనారోగ్యం, అక్క ఆరోగ్య సమస్యలు తనను తీవ్ర నిరాశకు గురి చేశాయని పేర్కొన్నాడు. తన పరిస్థితిని ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందించి నిరుద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని లేఖలో విజ్ఞప్తి చేశాడు. తనలాంటి నిరుద్యోగులు ఇలాంటి పరిస్థితులకు చేరుకోకుండా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా కోరాడు. ఈ ఘటన నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి, ఉద్యోగాల కోసం దీర్ఘకాల



నిరీక్షణ వంటి అంశాలను మరోసారి చర్చకు తెచ్చింది.

## ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్టంగా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**మంథని/అంతర్గాం, ఆగష్టు-01, నేటి శుభోదయ :**
ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్టంగా సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆయన పరిశీలించారు.అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గోదావరి జలాలను రైతులకు సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రభుత్వం అన్ని ప్రాజెక్టుల నీటి లభ్యత, వరద పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి వంటి ప్రధాన ప్రాజెక్టులు నిర్మాణం చేపట్టబడి రైతులకు సాగునీరు అందిస్తున్నాయని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయవద్దని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్డ ీఎసఏ) లిఖితపూర్వకంగా సూచించిందని, నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు వాటి పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు నీటి తరలింపును కొనసాగిస్తున్నామని తెలిపారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల జలస్థితిని పరిశీలించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. రైతులకు నీటి లభ్యతపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం బ్యారేజీల విషయంలో ఎనడ ీఎసఏ సూచనలను ప్రభుత్వం పూర్తిగా పాటిస్తోందని, దీనిపై





అనవసర రాజకీయాలు చేయడం సరికాదన్నారు.కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణ లోపాల కారణంగానే సమస్యలు తలెత్తాయని విమర్శించారు. నీటిపారుదల రంగంలో శాస్త్రీయ ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, గడ్డం వినోద్ కుమార్, వెడ్మ బొజ్జు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కుల వివక్షపై వార్త రాసిన విలేకరిపైనే ఫిర్యాదా?.. దేవాలయంలో సమాన న్యాయం కోరుతున్న భక్తులు

**వికారాబాద్, ఆగష్టు-01, నేటి శుభోదయ :**
వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: కుల్కచర్ల మండలంలోని రామ లింగేశ్వర స్వామి దేవాలయంలో గిరిప్రదక్షిణ సందర్భంగా కుల వివక్ష చోటుచేసుకుందని, అణగారిన వర్గాలకు చెందిన భక్తులను దూషించిన ఘటనపై వార్త ప్రచురించిన విలేకరిపైనే దేవాలయ చైర్మన్ పోలీసులకు ఫిర్యాదు చేయడం పట్ల స్థానిక భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుల వివక్షను వెలుగులోకి తీసుకువచ్చిన విలేకరిపై చర్యలు తీసుకోవడం సమంజసం కాదని వారు ప్రశ్నిస్తున్నారు.భక్తుల కథనం ప్రకారం, గిరిప్రదక్షిణ చేసిన అణగారిన వర్గాలకు చెందిన వ్యక్తులను కొందరు అభ్యంతరకర వ్యాఖ్యలతో అవమానించారని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై వార్త ప్రచురించిన అనంతరం విలేకరికి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారని, "మా అధికారమేంటో చూపిస్తాం", "నీ అంతు చూస్తాం" వంటి హెచ్చరికలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై కుల్కచర్ల ఎస్సైను సంప్రదించగా, దేవాలయ చైర్మన్ ఫిర్యాదు చేసినట్లు తెలిపినట్లు పేర్కొంటున్నారు.దేవాలయంలో కుల వివక్ష జరుగుతోందని ఆలయ ఈవోకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన రాలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. సమాజంలో జరుగుతున్న మంచి, చెడు విషయాలను ప్రజలకు తెలియజేసే విలేకరిపై ఒత్తిడి తీసుకురావడం, బెదిరింపులకు పాల్పడటం సరైన విధానం కాదని అభిప్రాయపడుతున్నారు.కుల దూషణలకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా, ఆ ఘటనపై వార్త ప్రచురించిన విలేకరిపైనే ఫిర్యాదు చేయడం ఎందుకని భక్తులు ప్రశ్నిస్తున్నారు. దేవాలయంలో అన్ని వర్గాల




శుభోదయ
గిరి ప్రదక్షిణపై కులవివక్ష ఆరోపణలు.. భక్తుల్లో ఆందోళన
వికారాబాద్ , జూలై 26, నేటి శుభోదయ :
శుభోదయ
దేవుని వార్త రాయడమే తప్పా..?
సంబంధిత యంత్రాంగం జోక్యం చేసుకుని వాస్తవాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

భక్తులకు సమాన న్యాయం జరగాలని, కుల వివక్షకు తావులేని వాతావరణం కల్పించాలని వారు కోరుతున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు ఆగస్టు 10 వరకు గడువు పొడిగింపు..అదనపు సమయాన్ని నాణ్యత పెంపునకు వినియోగించాలి :భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్

- ఎస్ఐఆర్ అమలుపై రంగారెడ్డి జిల్లా అధికారులతో సమీక్ష.జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన






**రంగారెడ్డి,ఆగస్టు01, నేటి శుభోదయ :** భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమానికి ఆగస్టు 10 వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో,లభించిన అదనపు సమయాన్ని పూర్తిగా నాణ్యత పెంపునకు వినియోగించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు.శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశానికి హాజరైన భారత ఎన్నికల సంఘం కార్యదర్శికి జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి,చంద్రారెడ్డి ఘన స్వాగతం పలికారు.సమీక్షా సమావేశంలో భారత ఎన్నికల సంఘం కార్యదర్శి మాట్లాడుతూ..ఇప్పటి వరకు జిల్లా అధికారులు,ఎన్నికల సిబ్బంది చేసిన కృషిని అభినందించారు.జిల్లాలో నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలు,ఫారం ఫిల్లింగ్ మేళాలు ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంచాయని ప్రశంసించారు.ప్రారంభంలో రాష్ట్ర సగటుతో పోలిస్తే డిజిటైజేషన్ వేగం తక్కువగా ఉండటంతో పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వచ్చినట్లు తెలిపారు.ప్రస్తుతం ఎన్నికల సంఘం అదనంగా ఏడు రోజుల గడువు కల్పించిన నేపథ్యంలో,ఇప్పటికే డిజిటైజ్ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు,ఫోటోలు,పత్రాల అప్‌లోడ్ తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా నిర్ధారించాలని సూచించారు.ఈఆర్‌వోలు,ఏఈఆర్‌వోలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నాణ్యతను ధృవీకరించాలని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని,ప్రతి పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్న చోట వాటినే పోలింగ్ కేంద్రాలుగా వినియోగించాలని,అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రైవేట్ భవనాలను ఉపయోగించాలని స్పష్టం చేశారు. మరణించిన,చిరునామా మార్చుకున్న లేదా గుర్తించలేని ఓటర్ల వివరాలను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి కుటుంబ సభ్యులు,స్థానిక సమాచారం ఆధారంగా పూర్తిస్థాయిలో ధృవీకరించాలని సూచించారు.తద్వారా భవిష్యత్తులో వచ్చే అభ్యంతరాలు,నోటీసుల సంఖ్య తగ్గుతుందని పేర్కొన్నారు.అవసరమైతే అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను నియమించి పనిభారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఓటర్ల జాబితాలో పేర్లు గుర్తించలేకపోతున్నామని,బీఎల్‌వోలు అందుబాటులో లేరనే ఫిర్యాదులు ఎన్నికల సంఘానికి వస్తున్నాయని పేర్కొంటూ,అలాంటి సందర్భాల్లో బీఎల్‌వోలు ప్రజలకు పూర్తి సహకారం అందిస్తూ అవసరమైన దరఖాస్తులు స్వీకరించి ఎన్నికల ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు.రంగారెడ్డి జిల్లాలో అధికారులు,సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్న తీరు సంతృప్తికరంగా ఉందని, ఇదే ఉత్సాహంతో మిగిలిన ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేసి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ..ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా,నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 3,501 పోలింగ్ కేంద్రాలు,36,99,743 మంది ఓటర్లు ఉన్నారని,ఒక్కో పోలింగ్ కేంద్రానికి సగటున 1,056 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు.శేరిలింగంపల్లి,ఎల్.బీ.నగర్,రాజేంద్రనగర్,మహేశ్వరం వంటి పట్టణ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో మ్యాపింగ్ ప్రక్రియ సవాలుగా మారిందన్నారు.కొన్ని గ్రామాలు,పోలింగ్ కేంద్రాలు రెండు జిల్లాల పరిధిలో ఉండటంతో ప్రత్యేక సమన్వయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రస్తుతం జిల్లాలో 63.53 శాతం మ్యాపింగ్ పూర్తయ్యిందని,మిగిలిన ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని,గ్రామీణ నియోజకవర్గాల్లో మంచి పురోగతి నమోదవుతుండగా,పట్టణ ప్రాంతాల్లో పెండింగ్ మ్యాపింగ్,అనామలీస్,డూప్లికేట్,నో మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు.ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఆగస్టు 10 వరకు గడువు పొడిగించడం జిల్లాకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు.ఈ అదనపు సమయాన్ని పూర్తిగా వినియోగించుకొని ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలిపారు.

బీఎల్‌వోలు,బీఎల్ఏలతో కలిసి పెండింగ్ కేసులను సంయుక్తంగా ధృవీకరించి,అవసరమైన చోట ఓటర్లను నేరుగా సంప్రదించి వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు.రాజకీయ పార్టీలతో ఇప్పటికే విస్తృత సమావేశాలు నిర్వహించి అపోహలను తొలగించామని,మరోసారి ఈఆర్‌వో స్థాయిలో సమావేశాలు నిర్వహించి మిగిలిన ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు.గేటెడ్ కమ్యూనిటీలకు దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను సాధ్యమైనంత వరకు అదే కమ్యూనిటీల్లో ఏర్పాటు చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని,ఓటర్లకు మరింత సౌకర్యవంతమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటే లక్ష్యమని స్పష్టం చేశారు.ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభం నుంచి జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు,ప్రత్యేక శిబిరాలు,ఫారం ఫిల్లింగ్ మేళాలు నిర్వహించడం వల్ల ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు.ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితంగా నమోదయ్యేలా అత్యున్నత నాణ్యతతో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.సమీక్ష అనంతరం భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్,అదనపు కలెక్టర్ కె. కిరణ్మయితో కలిసి కొంగర,బొంగులూరు,ఎల్‌బీ నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు.బీఎల్‌వోలతో మాట్లాడి ప్రక్రియ నిర్వహణ,ఎదురవుతున్న సమస్యలు,ప్రజల స్పందన తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి,చంద్రారెడ్డి, జోనల్ కమిషనర్లు,ఈఆర్‌వోలు,జిల్లా అధికారులు,ఎన్నికల విభాగం అధికారులు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేశంపేట పీహెచ్‌సీకి 50 కుర్చీల విరాళం



**కేశంపేట, ఆగస్టు01, నేటి శుభోదయ :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేశంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆదేశాల మేరకు ఆయన తనయుడు, యువ నాయకుడు మురళీకృష్ణ యాదవ్ ఆసుపత్రిని సందర్శించి వైద్యులు, సిబ్బందితో సమావేశమై అక్కడి అవసరాలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సమావేశాలు, ప్రత్యేక కార్యక్రమాలు, ఉన్నతాధికారులు లేదా అతిథులు వచ్చినప్పుడు కూర్చునేందుకు తగినన్ని కుర్చీలు లేవని, కనీసం 50 కుర్చీలు అవసరమని వైద్య సిబ్బంది వివరించారు.దీనిపై వెంటనే స్పందించిన మురళీకృష్ణ యాదవ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సూచన మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 50 కుర్చీలను విరాళంగా అందజేశారు. అంతకుముందు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, యువ నాయకుడు మురళీకృష్ణ యాదవ్‌లకు వైద్యులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నల్లవోలు మురళీధర్ రెడ్డి, సంగెం సర్పంచ్ వేణుగోపాల చారి, పార్టీ సీనియర్ నాయకులు తలసాని వెంకటరెడ్డి, కామ్లేకార్ నవీన్ కుమార్, జమాల్ ఖాన్, తిరుమల రెడ్డి శ్రీనివాస్, సోప్పరి రామకృష్ణ, సలీం, యాదగిరి, మెడికల్ ఆఫీసర్ డా. ముర్తుజ, ఫార్మసీ ఆఫీసర్ లావణ్య, నర్సింగ్ ఆఫీసర్ ప్రభావతి, ఏఎన్ఎంలు సంతోష, సుదీప్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

# తునికి ఖల్సలో పిజెటిఏయు రాజేంద్రనగర్ వ్యవసాయ విద్యార్థుల గ్రామీణ అధ్యయన పీఆర్ఏ కార్యక్రమం



**వర్గల్, ఆగస్టు 01 , నేటి శుభోదయ :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పిజెటిఏయురాజేంద్రనగర్ 4వ సంవత్సరం విద్యార్థులు తమ 'రావెప్' అధ్యయనంలో భాగంగా సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికి ఖల్స గ్రామంలో 'పాల్గొనే గ్రామీణ అంచనా' పీఆర్ఏ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్థానిక రైతులతో కలిసి గ్రామానికి చెందిన భౌగోళిక నమూనా, సాగు భూములు మరియు నీటి వనరులను ప్రతిబింబించే సామాజిక పటం ప్రదర్శించారు. అనంతరం పంట దిగుబడుల పెంపు, చీడపీడల నివారణ మరియు ఆధునిక సాగు పద్ధతులపై రైతులతో ముఖాముఖి నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండగల్ల గణేష్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, టివిఆర్కె సీనియర్ సైంటిస్ట్ అలాగే ఆర్ఏ డబ్ల్యూఈపీ హెడ్ పల్లవి గారు, ఏఈఓ అనిత, స్థానిక గ్రామ పెద్దలు, రైతులతో పాటు వ్యవసాయ విద్యార్థినులు వెంకట హర్షిని , లావణ్య, హర్షద, భార్గవి, ప్రవీణ, అనూష తదితరులు పాల్గొన్నారు.

# ముదిగొండ మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



**ఖమ్మం, ఆగస్టు01, నేటి శుభోదయ :** ముదిగొండ మండలంలోని వల్లభి గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ బత్తుల రాజు కి ఇటీవల ప్రమాదం జరగడంతో చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతం అన్‌సీజన్ కావడంతో ఆయన పరిస్థితిని గుర్తించిన ముదిగొండ మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా సంఘం అధ్యక్షులు మారగాని వెంకట్, జిల్లా కోశాధికారి నిరుడు తిరుపతి సహకారంతో మొత్తం రూ 11,000/- (పదకొండు వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని సమీకరించడం జరిగింది.శనివారం జిల్లా అధ్యక్షులు మారగాని వెంకట్ చేతుల మీదుగా బత్తుల రాజు కి రూ 11,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ముదిగొండ మండల అధ్యక్షులు సామాల కోటేశ్వరరావు, కోశాధికారి మేకపోతుల చిన్నచందర్రావు, అలాగే మండలానికి చెందిన ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి ఫోటోగ్రాఫర్ సభ్యునికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, సభ్యుల ఐక్యతే సంఘ బలమని పేర్కొన్నారు.ఈ ఆర్థిక సహాయానికి సహకరించిన జిల్లా మరియు మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# యువతా మేలుకో ! ఓటు డిజిటలైజేషన్ ప్రక్రియకు సహకరించండీ : అందే లక్ష్మణరావు



**రాజేంద్ర నగర్,ఆగష్టు 01, నేటి శుభోదయ :** జాతీయోద్యమముతో స్వరాజ్యం సాధించిన పిదప రాజ్యాంగ బద్ధమైన ప్రాథమిక ఓటు హక్కును కలిగి ఉండడం ప్రతి పౌరుడు బాధ్యత అనీ బిఆర్ఎస్ పార్టీనాయకులు అందే లక్ష్మణ్ రావు తెలిపారు.ఓటును సద్వినియోగ పరుచు కోవాలంటే ముందు ఓటు డిజిటలైజేషన్ ప్రక్రియకు స్పందించి ఓటు హక్కును తప్పకుండా పొందాలని అన్యథా ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం పొంచి ఉన్నదని అన్నారు,అందుకు అనుగుణంగా ఎన్నికల సంఘం డిజిటలైజేషన్ ప్రక్రియను మళ్లీ ఒకసారి ఆగస్టు10 వరకు పొడిగించడం సముచితమే కాగా ఈ సదవకాశాన్ని ప్రత్యేకంగా యువత సద్వినియోగ పరుచు కోవాలని కోరారు.అందులో భాగంగా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు తలపెట్టిన ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సహాయ శిబిరంలో శనివారం ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఓటు ఎన్యుమరేషన్ ఫారం ఏ బి.ఎల్.ఓ వద్ద లభిస్తుంధో వివరాలు తెలియ పరచడం,2002 లో వారి యొక్క లేదా వారి పరివారం సభ్యుల ఓటు వివరాలను తెలియజేస్తూ తద్వారా ఎన్యూమరెశన్ ధరకాస్తూ ఫారం పూరించి మ్యాపింగ్ చేయడంలో సంపూర్ణ సహకారన్ని అందించడం జరిగిందని మణికొండ,నెక్నంపూర్ డివిజన్ బి.ఆర్.ఎస్ నాయకులు గుట్టమీద నరేందర్ అందే లక్ష్మణ్ రావు,శైక్ ఆరీఫ్,భాను చందర్ తదితరులు తెలిపారు.

# వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కలసిన ఐ ఎన్ టియు జిల్లా నాయకులు



**వరంగల్, ఆగష్టు 01, నేటి శుభోదయ :** వరంగల్ వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బొమ్మన రాజారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి వరంగల్ జిల్లా నాయకులు శనివారం ఆయనను మర్యాదపుర్వాకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు.వరంగల్ కార్పొరేషన్ మున్సిపల్ కార్యాలయంలో సుదీర్ఘకాలం పనిచేసిన రాజారెడ్డి ఈ కార్యక్రమం పూర్తి చేయడం అభినందనీయమని, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ సహాయ సహకారాలు అందజేయడం,ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని వారు సూచించారు.ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు .ఐ న్ టీ యూ సి వరంగల్ జిల్లా నాయకులు పుల్ల రమేష్, జిల్లా అధ్యక్షుడు,పాశం రవి యాదవ్, గ్రేటర్ సంగం అధ్యక్షుడు, మెడికల్ అండ్ ఎల్త్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్, ఎల్త్ ఇన్స్పెక్టర్ జి. మధుకర్, గ్రేటర్ కార్యా దర్శి డి. రమేష్,జి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఉప్పల్ ఎస్ హెచ్ ఓ వై. రామలింగారెడ్డి

- ఉప్పల్ స్కై వాక్ పై ప్రయాణీకులకు అవగాహన కల్పించిన సీఐ



**ఉప్పల్, ఆగస్టు 01 , నేటి శుభోదయ :** ప్రయాణ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవాలని ఉప్పల్ ఎస్ హెచ్ఓ వై. రామలింగారెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఉప్పల్ రింగ్ రోడ్ లోని స్కైవాక్ మీద ప్రయాణీకులకు సిఐ రామలింగారెడ్డి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు బస్సులు, రైళ్లు ఎక్కే, దిగే సమయంలో తమ విలువైన వస్తువులు, సెల్ ఫోన్లు, ఆభరణాల పట్ల అప్రమత్తంగా ఉండాలనీ, అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని అన్నారు. డిజిటల్ అరెస్ట్ అయ్యారంటూ పోలీసుల తరహాలో ఫోన్ లు చేసి బెదిరించే వారిని గమనించి భయపడకుండా 1930 నెంబర్ కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. రోడ్డు దాటే సమయంలో ట్రాఫిక్ నియమాలను పాటించాలని, బస్టాప్ లు, ఇతర రద్దీ ప్రాంతాలలో ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు, వస్తువులు కనపడితే సమీపంలోని పోలీస్ స్టేషన్ లో గానీ, 100 నెంబర్ కు ఫోన్ చేసి పోలీస్ కంట్రోల్ రూమ్ కు గానీ సమాచారం ఇవ్వాలని ఇనస్పెక్టర్ వై. రామలింగారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎస్ఐ చిరంజీవి, ఏఎస్ఐ అశోక్ రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వెల్టూరులో సమస్యలను పరిష్కరించాలి - భాజపా





**చిన్నంబావి, ఆగస్టు 01, నేటి శుభోదయ :** వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో నిలిచిపోయిన తాగునీటి సరఫరాను పునరుద్ధరించడంతో పాటు వీధి దీపాల సమస్యను త్వరగా పరిష్కరించాలని భాజపా నాయకులు కోరారు. శనివారం మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య నేతృత్వంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశమైన నాయకులు, గ్రామంలోని చేతిపంపులు, బోర్లకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ సమస్యల పరిష్కారం కొరకు ఎంపీడీవో సూర్ణ ఆదర్శ గౌడ్, గ్రామ సర్పంచ్ బెక్కెం సుజాతమ్మలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జగ్గారి శ్రీధర్ రెడ్డి, కురువ చిన్నమల్లన్న, గణేష్ రెడ్డి, మేఖల చెన్నయ్య యాదవ్, మద్దిలేటి, రాము, ఉమేష్ చంద్ర, వెంకటస్వామి, శివకుమార్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగ ఉత్సవాలకు 80 దేవాలయాలకు రూ. 27 లక్షల గ్రాంట్ చెక్కులు అందజేత :ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్,ఆగస్టు01, నేటి శుభోదయ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బోనాల పండుగను పురస్కరించుకుని,జిహెచ్ఎంసి పరిధిలోని అమ్మవారి దేవాలయాల అలంకరణ,ఉత్సవాల నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు.ఇందులో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం శివరాంపల్లి రాందేవ్ బాబా ఆలయ ప్రాంగణంలో చెక్కులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,ప్రభుత్వ సలహాదారు హర్క వేణుగోపాల్ తో కలిసి పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..ప్రభుత్వం మంజూరు చేసిన ఈ నిధులతో ఆయా ఆలయాల కమిటీలు అమ్మవారి ఆలయాలను సుందరంగా అలంకరించి,భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని కోరారు.అనంతరం 80 దేవాలయాల కమిటీ సభ్యులకు రూ.27 లక్షల విలువైన గ్రాంట్ చెక్కులను వారు స్వయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,దేలయల కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు &క్రీడల మంత్రిత్వ శాఖ

- ఆధ్వర్యంలో, నశా ముక్త్ భారత్ అభియాన్
- ప్రమరియు మేరా యువ భారత్ సంయుక్త సౌజన్యం తో



**వనపర్తి, ఆగస్టు 01 , నేటి శుభోదయ :** వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి "నశా ముక్త్ భారత్" కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి ఈశ్వరయ్య అధ్యక్షతన,"యాంటీ డ్రగ్స్"కన్వీనర్ డాక్టర్ పోతురాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.విద్యార్థుల్లో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో నుక్కడ్ నాటకం, పాటల పోటీలు, వ్యాసరచన, పోస్టర్ తయారీ తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు (సర్టిఫికెట్లు) మరియు బహుమతులను అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వనపర్తి జిల్లా ఎక్సైజ్ ఎస్ఐ పృథ్వీరాజ్ సునీత గారు విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య గారు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించి, యువత మత్తుకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.జిల్లా యువజన అధికారి శ్రీ వి. కోట నాయక్ గారు మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొంటూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో నశా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నుక్కడ్ నాటకం మత్తు వ్యసనాల వల్ల వ్యక్తి, కుటుంబం, సమాజంపై కలిగే దుష్పరిణామాలను హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించి అందరి ప్రశంసలు అందుకుంది.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ రామరాజు యాదవ్ గారు, అకాడమీ కోఆర్డినేటర్ కే దామోదర్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, డాక్టర్ జి సుష్మ, డాక్టర్ ఎల్ పుష్ప, కే గోవర్ధన్, డాక్టర్ శ్రీ మన్నేమన్న, డాక్టర్ విజయలక్ష్మి , డాక్టర్ కే జగదీశ్వరయ్య, స్రవంతి, యువ రూప లక్ష్మి , మరియు విద్యార్థులు,పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పట్టుపరిశ్రమను లాభదాయకమైన అనుబంధ వ్యవసాయంగా చేపట్టాలి : జిల్లా కలెక్టర్ డా. సత్య శారద



**వరంగల్, ఆగస్టు 01 , నేటి శుభోదయ :** రైతులు పట్టుపరిశ్రమను లాభదాయకమైన అనుబంధ వ్యవసాయ కార్యకలాపంగా చేపట్టి అధిక, స్థిరమైన ఆదాయాన్ని పొందాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పిలుపునిచ్చారు. సెంట్రల్ సిల్క్ బోర్డు ఆధ్వర్యంలో "మేరా రేషమ్ మేరా అభిమాన్–2.0" కార్యక్రమంలో భాగంగా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ సమన్వయంతో శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వాటాదారుల సంప్రదింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ..వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు డ్రిప్ ఇరిగేషన్‌ను విస్తృతంగా వినియోగించాలని, పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.ఆయిల్ పామ్ తోటల్లో మల్బరీని అంతర పంటగా సాగు చేయడం, మల్బరీని సేంద్రీయ విధానంలో పండించడం, అంతర పంటలుగా పూల సాగు చేపట్టడం, భూగర్భ జలాల పరిరక్షణ కోసం వ్యవసాయ క్షేత్రాల్లో చెరువుల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.పట్టు ఉత్పత్తులకు విలువ జోడింపు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలను మరింతగా వినియోగించుకోవడానికి వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ సౌకర్యాలు, జిల్లాలోని ఎగుమతి హబ్‌ను రైతులు ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు శ్రీమతి భువన (సైంటిస్ట్–బి), డా. బి. తిరుపం రెడ్డి (సైంటిస్ట్–సి) జిల్లాలో పట్టుపరిశ్రమ అభివృద్ధికి బోర్డు అందిస్తున్న సాంకేతిక సహాయం, పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలపై వివరించారు.జాయింట్ డైరెక్టర్ అనుసూయ, అసిస్టెంట్ డైరెక్టర్ (సెరికల్చర్) తిరుపతి రెడ్డి, సెరికల్చర్ అధికారి మల్లయ్య రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, మార్కెటింగ్ అవకాశాల గురించి వివరించారు.ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులను మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకం వైపు ప్రోత్సహించేందుకు ఇదే అనుకూల సమయమని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలో పట్టుపరిశ్రమ అభివృద్ధికి అనుకూల వాతావరణం, మార్కెటింగ్ అవకాశాలు ఉన్నాయని చెప్పారు."మేరా రేషమ్ మేరా అభిమాన్–2.0" ద్వారా సెంట్రల్ సిల్క్ బోర్డు అందిస్తున్న మార్గదర్శకాలు పట్టు రైతుల ఉత్పాదకత, నాణ్యత, మార్కెట్ అనుసంధానాన్ని మెరుగుపరచడంలో కీలకంగా నిలుస్తాయని కలెక్టర్ తెలిపారు. విజయవంతమైన పట్టురైతులు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకుని మరింత మందిని ఈ రంగం వైపు ఆకర్షించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, హార్టికల్చర్ అధికారులు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మూడు హృదయాలు_ _ _ ముప్పై ఏళ్ల అనుబంధం

- కాలం మారినా తగ్గని బంధం_ _ _ తరాలకు ఆదర్శంగా నిలిచిన ముగ్గురు మిత్రులు
- బోధన్ క్యాంపస్‌లో మొలిచిన స్నేహం... ఎనిమిది కార్పొరేట్ ఆసుపత్రులుగా విస్తరించిన మానవతా యాత్ర
- తాళ్ల సుమన్ గౌడ్, మహమ్మద్ అసద్ ఖాన్, తూర్పు వివేకానంద రెడ్డి
- ఒకే బెంచ్‌పై మొదలైన బంధం.. లక్షల కుటుంబాలకు ఆరోగ్య భరోసాగా మారిన కథ




**నిజామాబాద్, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఆర్కే ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లో 2002లో మొదలైన ఒక సాధారణ పరిచయం,కాలక్రమంలో వేలాది కుటుంబాల జీవితాల్లో ఆశను నింపే ఆరోగ్య ఉద్యమంగా మారుతుందని అప్పట్లో ఎవ్వరూ ఊహించలేదు.ఒకే తరగతి,ఒకే బెంచ్,ఒకే కలలు——అలా మొదలైన ముగ్గురు యువకుల స్నేహం నేడు తెలంగాణలో ఎనిమిది కార్పొరేట్ ఆసుపత్రుల రూపంలో మానవతా సేవగా వికసించింది.ఆ ముగ్గురు స్నేహితులే తాళ్ల సుమన్ గౌడ్,మహమ్మద్ అసద్ ఖాన్,తూర్పు వివేకానంద రెడ్డి.విద్యార్థి దశ ముగిసింది.ఉద్యోగాలు,వ్యాపారాలు,కుటుంబ బాధ్యతలు——జీవితాలు ఒక్కొక్క దిశలో సాగిపోయాయి.కానీ వారి స్నేహం మాత్రం దూరాలను లెక్క చేయలేదు.కాలం వారిని విడదీయలేకపోయింది.ఆ బంధం మరింత బలపడింది.ఆ బలమైన స్నేహమే తరువాత ఒక సామాజిక సంకల్పానికి రూపం ఇచ్చింది.ఒక ప్రశ్న... ఒక సంకల్పంసమాజంలో పేదలు,మధ్యతరగతి కుటుంబాలు వైద్య ఖర్చుల భారంతో పడుతున్న కష్టాలను వారు దగ్గరగా గమనించారు.డబ్బు లేకపోవడం వల్ల చికిత్సకు దూరమవుతున్న కుటుంబాల బాధ వారిని కలచివేసింది."డబ్బు లేని కారణంగా ఎవ్వరూ వైద్యం కోల్పోకూడదు" అనే ఒక్క లక్ష్యం వారి జీవితాలను కొత్త దిశలో నడిపించింది.ఆ ఆలోచనకు రూపమే వెల్నెస్ హాస్పిటల్స్.అమీర్‌పేట్‌లో మొదలై తెలంగాణ అంతటా విస్తరించిన సేవహైదరాబాద్ అమీర్‌పేట్ డీకే రోడ్డులో మొదటి వెల్నెస్ హాస్పిటల్ ప్రారంభమైంది.కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను సామాన్యులకు అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఆ ఆసుపత్రి,కొద్దికాలంలోనే ప్రజల విశ్వాసాన్ని సంపాదించింది.ఆ తర్వాత సేవా ప్రయాణం వేగం అందుకుంది.– అమీర్‌పేట్ – డీకే రోడ్– అమీర్‌పేట్ – లాల్ బంగ్లా– బి.ఎన్.రెడ్డి నగర్– శ్యామ్ కారం రోడ్, అమీర్‌పేట్– సంగారెడ్డి– కొంపల్లి– నిజామాబాద్– బేగంపేట్నేడు తెలంగాణలో ఎనిమిది వెల్నెస్ హాస్పిటల్ బ్రాంచ్‌లు విజయవంతంగా సేవలందిస్తున్నాయి.వ్యాపారం కాదు... మానవతా సేవవెల్నెస్ హాస్పిటల్స్ ప్రత్యేకత కేవలం ఆసుపత్రుల సంఖ్యలో లేదు.పేద,మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అత్యల్ప ధరల్లో అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఫ్యామిలీ హెల్త్ కార్డ్ కార్యక్రమం వేలాది కుటుంబాలకు ఆరోగ్య భరోసాగా మారింది.ఈ కార్డు ద్వారా రాయితీతో వైద్యసేవలు,మందులు,పరీక్షలు,ఇన్‌పేషెంట్ సదుపాయాలు,అత్యవసర సేవలు వంటి అనేక ప్రయోజనాలు అందుతున్నాయి.ముఖ్యంగా నిజామాబాద్ జిల్లాలో లక్ష మందికి పైగా ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు సంస్థ వర్గాలు చెబుతున్నాయి.స్నేహం నుంచి సేవ... సేవ నుంచి సంస్థఒకే బెంచ్‌పై కూర్చొని కలలు కనిన ముగ్గురు స్నేహితులు,నేడు వేలాది మంది రోగులకు నాణ్యమైన వైద్యం అందించే సంస్థను నిర్మించారు.వ్యాపార విస్తరణ కంటే మానవతా సేవకు ప్రాధాన్యం ఇవ్వడం వారి ప్రయాణాన్ని ప్రత్యేకంగా నిలబెట్టింది.త్వరలోనే నిజామాబాద్ జిల్లాలో వెల్నెస్ నర్సింగ్ కాలేజ్,అలాగే వరంగల్,దక్షిణ భారతంలోని ఇతర ప్రాంతాలకు వెల్నెస్ హాస్పిటల్ సేవలను విస్తరించే ప్రణాళికలు కూడా కొనసాగుతున్నాయి.స్నేహితుల దినోత్సవానికి స్ఫూర్తిఈ ముగ్గురు మిత్రుల కథ కేవలం విజయ గాథ కాదు.ఇది స్నేహం,నమ్మకం, సేవాభావం,సామాజిక బాధ్యత కలిసి సృష్టించిన అరుదైన గాథ.బోధన్ కళాశాల క్యాంపస్‌లో మొదలైన ఆ బంధం,నేడు వేలాది కుటుంబాల జీవితాల్లో ఆరోగ్యాన్ని,ఆశను,భరోసాను నింపుతోంది.సమాజానికి ఉపయోగపడే ఒక కల,నిజమైన స్నేహితుల చేతుల్లో పడితే ఎంత గొప్ప ఉద్యమంగా మారుతుందో తాళ్ల సుమన్ గౌడ్,మహమ్మద్ అసద్ ఖాన్,తూర్పు వివేకానంద రెడ్డి తమ జీవితాలతో నిరూపించారు.బోధన్ క్యాంపస్‌లో మొలిచిన ఆ స్నేహం_ _ _.నేడు ఎనిమిది కార్పొరేట్ ఆసుపత్రుల రూపంలో వేలాది హృదయాల్లో వెలుగుతోంది.స్నేహం శాశ్వతమైతే,సేవ అమరత్వాన్ని అందుకుంటుంది ఇదే ఈ ముగ్గురు మిత్రుల జీవితం చెబుతున్న గొప్ప సందేశం.

## లక్ష్యాల అమలులో నిర్లక్ష్యం సహించం : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- బ్యాంకు లింకేజీ, రుణాల వసూళ్లు, మహిళా సంఘాల ఆర్థిక సాధికారతపై ప్రత్యేక దృష్టి
- సెర్ప్ కార్యక్రమాల పురోగతిపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్




**ఖమ్మం,ఆగస్టు01, నేటి శుభోదయ :** జిల్లాలో సెర్ప్ కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేసి, స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి అధికారులు బాధ్యతా యుతంగా పనిచేయాలని, లక్ష్యాల అమలులో నిర్లక్ష్యం సహించమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు.శనివారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సెర్ప్ కార్యక్రమాల అమలు, వీఓ భవనాల నిర్మాణం, బ్యాంకు లింకేజీ, రుణాల వసూళ్లు, పీఎంఎఫ్ఎంఈ యూనిట్లు తదితర అంశాల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వీఓ భవనాల ప్రతిపాదనలు పంపే సమయంలో స్థల వివాదాలు లేని ప్రాంతాలనే ఎంపిక చేయాలని, వీఓ భవనాలకు స్థలాలను ప్రతిపాదించే ముందు రెండు, మూడు సార్లు క్షేత్ర స్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి మాత్రమే పంపించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి నెల ఎంతమంది స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలకు అర్హులవుతున్నారో ముందస్తు ప్రణాళికతో గుర్తించి, లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల వారీగా నెలవారీ లక్ష్యాలను నిర్ధారించి, బ్యాంకు లింకేజీపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.రుణాలు సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి, నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) శాతాన్ని తగ్గించేందుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఎర్రుపాలెంతో పాటు ఇతర ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని ఎన్‌వోసీలు, అనుమతులు త్వరితగతిన పొందాలని ఆదేశించారు. ప్రతి అధికారి పూర్తి బాధ్యతతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ వీఓ భవనాల స్థల సమస్యలను పరిష్కరించేందుకు వచ్చే శుక్రవారం నాటికి ప్రత్యామ్నాయ స్థలాల ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో బ్యాంకు లింకేజీ లక్ష్యం ఇప్పటి వరకు 12 శాతం మేర సాధించామని, ఇది రాష్ట్ర సగటుతో సమానమని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్‌పీఏ 1.68 శాతంగా ఉందని, దీనిని మరింత తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ శ్రీరామ్, అడిషనల్ డిఆర్డిఓ, డీపీఎంలు, ఏపీఎంలు, సెర్ప్, డిఆర్డిఏ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నాలాలో గల్లంతు అయిన బాలయ్య కుటుంబానికి బి.ఆర్.ఎస్ పార్టీ 50 వేలఆర్థిక సహాయం



**శేరిలింగంపల్లి , ఆగస్టు01, నేటి శుభోదయ :** శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ డివిజన్ ప్రేమ్ నగర్ నాలాలో గల్లంతు అయిన బాలయ్య పేద కుటుంబ సభ్యులకు తాత్కాలిక ఉపశమనం కోసం శేరిలింగంపల్లి బీ.ఆర్.ఎస్ పార్టీ తరుపున 50 వేల రూపాయల ఆర్థిక సహాయం చేయటం జరిగినది.నాలాలో గల్లంతు అయిన వ్యక్తి జాడ 5 రోజులు అయిన తెలియలేదు.పై అధికారుల పర్యవేక్షణ లోపం. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం లోపం కనిపిస్తుంది.వెంటనే చొరవ తీసుకొని గల్లంతు అయిన వ్యక్తి ఆచూకీ కనుకొనడం,పేద కుటుంభంను ఆదుకోవాలని శేరిలింగంపల్లి బీ.ఆర్.ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంది.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీ.ఆర్.ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు,మహిళ నాయకులు,కార్యకర్తలు మొదలగువారు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో జనసేన జెండా ఎగురవేస్తాం

- ప్రజా సమస్యలపై పోరాడుతూ జనసేనను బలోపేతం చేస్తాం
- జనసేన రాష్ట్ర నాయకులు రామ్ తళ్లూరి,ఆర్కే సాగర్, హీరో తనీష్
- షాద్‌నగర్‌లో రాష్ట్ర నాయకులకు ఘన స్వాగతం పలికిన జరుపుల రాజు నాయక్






**షాద్ నగర్,ఆగస్టు 01, నేటి శుభోదయ :**
తెలంగాణలో గ్రామ స్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేస్తూ ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు జనసేన రాష్ట్ర నాయకులు రామ్ తళ్లూరి,ఆర్కే సాగర్,హీరో తనీష్ పేర్కొన్నారు.మహబూబ్‌నగర్ పార్లమెంటరీ పరిధిలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యేందుకు వెళ్తున్న జనసేన పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామ్ తళ్లూరి,ప్రచార కార్యదర్శి ఆర్కే సాగర్,సినీ నటుడు తనీష్‌లకు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బైపాస్ వద్ద స్థానిక జనసేన నాయకులు జరుపుల రాజు నాయక్,మహమ్మద్ అశ్రఫ్ తో పాటు పలువురు నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా 17 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత విస్తరించనున్నట్లు చెప్పారు.గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి పోరాడుతామని స్పష్టం చేశారు.పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు తెలంగాణలోని ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేసి యువతను,కార్యకర్తలను మరింత చైతన్యవంతం చేయనున్నట్లు చెప్పారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైతే ప్రజల తరఫున ఉద్యమాలు చేపడతామని పేర్కొన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేస్తున్నామని,పార్టీ నాయకులను,కార్యకర్తలను ఎన్నికల బరిలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.గ్రామ స్థాయిలో ప్రజల విశ్వాసాన్ని సంపాదించేలా నాయకులు,కార్యకర్తలు పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీశైలం,పవన్ నాయక్,శివ జానీ,శ్రీకాంత్, రామకృష్ణ,మహబూబ్,లింగం నాయక్,మల్లేష్,శివ,కుమార్,చందు,పాపకంటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం కార్యదర్శిగా బారతి లక్ పతి నాయక్ సేవలు అభినందనీయం

- తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమీషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి







**రాజేంద్ర నగర్,ఆగష్టు 01, నేటి శుభోదయ :** రాజేంద్రన గ ర్ః రాష్ట్ర సమాచార హక్కు చట్టం కార్యదర్శిగా పాలన పరమైన చర్యలను చేపట్టడంలో భారతిలక్ పతి నాయక్ ఐఏఎస్ చేసి సేవలు అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమీషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి కొనియాడారు. సాధారణ కుటుంబానికి చెందిన మహిళ అయినా ఆత్మవిశ్వాసంతో చదువుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించి అంచలంచేలుగా ఎదుగుతూ ఐఏఎస్ హోదాలో, ప్రభుత్వ కార్యదర్శిగా పదవీ విరమణ చేయడం ఆమె పట్టుదలకు నిదర్శనమని గుర్తు చేశారు. శనివారం తెలంగాణ రాష్ట్ర సమాచారా హక్కు చట్టం కార్యదర్శిగా పనిచేసిన భారతిలక్ పతి నాయక్ ఐఏఎస్ ఉద్యోగ పదవీవిరమణ ఆత్మీయ విడ్కోలు సభ సమాచార హక్కు భవన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సమాచార హక్కు చట్టం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కమీషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి ఆమెను ఘనంగా సన్మానించి, పదవీవిరమణ సత్కర పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలం పాటు ఆర్టిఐ ప్రభుత్వ కార్యదర్శిగా పని చేసిన భారతి లక్ పతి నాయక్ కార్యాలయంలోని పరిపాలనను గాడిలో పెట్టడానికి కృషి చేశారన్నారు. కార్యాలయంలో ఖాళీగా ఉన్న స్థానాలలో ఉద్యోగులను భర్తీ చేయడంతో పాటు 20 వేల పెండిగ్ కేసులను కమీషనర్‌లు పరిష్కారించడ◌ానికి తనవంతు సహకారం అందించారని చెప్పారు. కష్టపడి ఐఏఎస్ స్థాయికి చేరుకోవడంతో పాటు వివిధ జిల్లాలలో తోపాటు సచివాలయంలోని పలు విభాగాలలో ఆమె సేవలందించారని, దాంతో కార్యాలయ పరిపాలనలో మంచి పట్టున్న అధికారిణిగా రాణించారని చెప్పారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలతో పాటు 2014 నుంచి 2023 వరకు వార్షిక నివేధికలు సిద్ధం చేయడంలో ఆమె ఎంతో సహకారం అందించారన్నారు. తొలిసారి శాసన సభకు డిజిటల్ రూపంలో వార్షిక నివేధికలను అందించడంలో కార్యదర్శిగా ఆమె కృషి ఉందని పేర్కొన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన భారతి లక్ పతి నాయక్ మాట్లాడుతూ ఎపిపిఎస్‌సి ద్వారా ఎంపికైన తాను ఉమ్మడి రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో మొట్ట మొదటి మహిళా డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించినట్లు చెప్పారు. . పూర్వపు ఖమ్మం జిల్లా, ప్రస్తుత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వచ ప్రాంతానికి చెందిన తాను 2025 జూన్ లో తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కార్యదర్శిగా బాధ్యతల స్వీకరించినట్లు తెలిపారు. అంతకు ముందు ప్రభుత్వ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో స్పెషన్ సెక్రెటరీగా, ఆరోగ్య శాఖ జాయింట్ కమీషనర్‌గా, జిఏడి డిప్యూటీ సెక్రెటరీగా, మహబూబ్ నగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా, ప్రభుత్వం చిన్నమొత్తాల పొదుపు శాఖ అసిస్టెంట్ కమీషనర్‌గా పని చేసినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా, ఆదిలాబాద్ జిల్లా రెవిన్యూ ఆఫీసర్‌గా, మొట్టమొదటి రంగారెడ్డి జిల్లా మహిళా డిప్యూటీ కలెక్టర్‌గా పని చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఆర్టిఐ కమీషనర్లు దేశాల భూపాల్, మోసిన ఫర్వీన్ తోపాటు వివిధ సెలక్షన్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రైజింగ్-2047'లో భాగస్వామ్యం అవ్వండి

- ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టి కృషితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి
- సీఎస్ఆర్ ద్వారా కీలక పాత్ర పోషించాలని కార్పొరేట్ సంస్థలకు పిలుపు..
- సదరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'లో మంత్రి శ్రీధర్ బాబు






**శేరిలింగంపల్లి , ఆగస్టు 01 , నేటి శుభోదయ :**
కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) ద్వారా 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యసాధనలో భాగస్వామ్యం కావాలని కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టిగా కృషి చేస్తేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ది ఇన్సిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ), హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్ లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న '50వ సదరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 'తెలంగాణ రైజింగ్-2047' అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యంతో సాకారమయ్యే అభివృద్ధి విజన్ అని వివరించారు. ఆర్థిక వృద్ధితో పాటు సామాజిక పురోగతి సమాంతరంగా సాగేలా ఆవిష్కరణల ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించేలా అభివృద్ధి ప్రతి నియోజకవర్గానికి, దాని ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా ఈ బృహత్తర ప్రణాళికను రూపొందించామన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వం పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ రంగం భాగస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సీఎస్ఆర్ ద్వారా సమాజంలో మార్పు తెచ్చే కార్యక్రమాల అమలుకు, పరిశ్రమల స్థాపనకు సంబంధించి ప్రతి దశలోనూ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భాగస్వామిగా, సహాయకారిగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు భరోసానిచ్చారు. ఏఐ, డేటా గవర్నెన్స్, సైబర్ భద్రత వంటి అంశాలు కార్పొరేట్ ప్రపంచంలో కొత్త సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో కంపెనీ సెక్రటరీలు కేవలం కంప్లయన్స్ నిపుణులుగా కాకుండా స్ట్రాటజిక్ బోర్డ్ అడ్వైజర్లుగా మారాల్సినఅవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంపెనీలు కేవలం లాభార్జనే కాకుండా సస్టైనబుల్, ఎథికల్ వ్యాపార వృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కాన్‌స్టిట్యూయెన్సీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ( సీడీఎక్స్)కు నాలెడ్జ్ పార్ట్ నర్ గా ఉండేందుకు ముందుకొచ్చిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా' ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్పొరేట్ కంపెనీలు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ ప్రతినిధులు మహదేవ్ తిరునగరి, ఎం.దామోదరన్, శిల్పా, కార్తీక్ సుమారు 750 డెలిగేట్ లు తదితరులు పాల్గొన్నారు.

## సర్ విజయవంతంగా ముగిసిన మ్యాపింగ్

### - తహశీల్దార్ పి.రాంప్రసాద్




**ఖమ్మం, ఆగస్టు 01 , నేటి శుభోదయ :** ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని నేల కొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ తెలిపారు. శనివారం తన చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోనే మొదటగా పూర్తి చేసి మండలం నిలి చిందన్నారు. మండలం లోని మొత్తం 32 గ్రామ పంచాయతీలలో కార్యక్రమం పూర్తి చేసినట్లు తెలిపారు. 233 పోలింగ్ స్టేషన్ నుంచి 291 పోలింగ్ స్టేషన్ వరకు నూరు శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మొత్తం ఓట్లు 49,395 ఓట్లు ఉండగా, మ్యాపింగ్ తరువాత 47,069 ఓట్లు ఉన్నట్లు తెలిపారు. 2,326 ఓట్లు డెత్, షిఫ్టింగ్, డబుల్ ' ఓట్లు ఇతరత్రా వాటిని తొలిగించినట్లు తెలిపారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకు బీఎల్వో లు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. అందుకు సహకరించిన బీఎల్ఏ లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలం గడువు కంటే ముందుగా పూర్తి చేసి ఆదర్శంగా నిలిపిన ప్రతీ ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ కనకం నరసింహారావు, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు తదిత రులు పాల్గొన్నారు.

## ఘట్కేసర్ పీఎస్ పరిధిలో రోడ్డు ప్రమాదాల కలకలం

- ఇద్దరు యువకుల దుర్మరణం, ఒకరికి తీవ్ర గాయాలు





**ఘట్కేసర్, ఆగస్టు 01 , నేటి శుభోదయ :** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల లో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఘట్కేసర్ సీఐ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం... జులై 31 న రాత్రి సమయంలో ఆసిఫ్ (24), పూర్షన్(22) అనే ఇద్దరు యువకులు ఎన్ఎఫ్ సీ నగర్ లో టైల్స్ వర్క్ చేసి బైక్ పై వెళ్తుండగా ఘట్కేసర్ బైపాస్ రోడ్ లో ఎదురుగా ఓ గుర్తుతెలి యని లారీ వచ్చి ఢీకొట్టడం తో ఆసిఫ్ అక్కడికక్కడే మరణించగా, పూర్షన్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయల పాలైన యువకుడిని ఆసుపత్రి కి తరలించి కేస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలస్వామి తెలిపారు.మరో సంఘటనలో యువకుడు మృతి హైదరాబాద్ చైతన్యపురి కి చెందిన దిలీప్ భాయ్ చౌహన్ (45) హనుమ కొండ కు బైక్ పై వెళ్తుండగా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి అవుషాపూర్ వద్దకు రాగానే తన ముందు వెళ్తున్న గుర్తుతెలి యని కారును అతడు ఢీ కొట్టి పడిపోగా, వెనుకనుండి వచ్చిన లారీ డ్రైవర్ అజాగ్రత్త తో దిలీప్ పై నుండి లారీ దూసుకెళ్ళింది. ఈ సంఘటన లో దిలీప్ అక్కడికక్కడే మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బాలస్వామి తెలిపారు.

## త్రివేణిలో వెల్లివిరిసిన స్నేహ బంధం






**ఖమ్మం, ఆగస్టు 01, నేటి శుభోదయ :** విద్యార్థుల్లో స్నేహం, సహకారం, పరస్పర గౌరవం వంటి విలు వలను పెంపొందించాలనే ఉద్దేశంతో త్రివేణి స్కూల్స్, ఖమ్మం శాఖలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్,వైస్ ప్రిన్సిపాల్స్ ముస్తఫా, స్వప్న ఒకరికొకరు ఫ్రెండ్షిప్ బ్యాండ్ కట్టుకొని విద్యా ర్థులను ఉత్సాహపర చగా, విద్యార్థులు కూడా ఒకరికొకరు ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టుకుని స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు.పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, "స్నేహం అనేది జీవితాన్ని సార్థకం చేసే గొప్ప బంధం. మంచి స్నేహితులు మనలోని ప్రతిభను వెలికితీసి, మంచి వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడతారు" అని అన్నారు. విద్యార్థులు మంచి అలవాట్లు, ఉన్నత విలువలు కలిగిన స్నేహితులను ఎంచుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల జీవితంలో ఏర్పడే స్నేహబంధాలు జీవితాంతం మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పరస్పర సహకారం, నమ్మకం, ప్రేమ, గౌరవంతో కూడిన స్నేహమే నిజమైన స్నేహమని, ప్రతి విద్యార్థి అలాంటి స్నేహాన్ని పెంపొందించుకోవాలని అలాగే ట్రూ ఫ్రెండ్షిప్ – ఫాల్స్ ఫ్రెండ్షిప్ మధ్య బేధం తెలుసుకుని స్నేహబంధం కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం విద్యార్థులు స్నేహం ప్రాముఖ్యతపై ప్రసంగాలు చేసి, ఉపాధ్యాయులు చదివిన కవితలు, పాడిన పాటలు ఆస్వాదిస్తూ, కేరింతలతో ఫ్రెండ్షిప్ బాండ్స్ కట్టుకొని అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇన్చార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇన్చార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెల్టూరులో నీటి కష్టాలు.. అధికారులపై బీజేపీ ఫైర్

- ఆరు బోర్లు ఎండిపోయినా చోద్యం చూస్తారా?
- కొత్త బోర్లు, వాటర్ ట్యాంక్, వీధి దీపాలు వెంటనే ఏర్పాటు చేయాలి



**చిన్నంబావి, ఆగస్టు 1 , నేటి శుభోదయ :** చిన్నంబావి మండల కేంద్రంలోనివెల్టూరు గ్రామంలో తాగునీటి సమస్యపై బీజేపీ నాయకులు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు బోర్లు అడుగంటిపోయి.. వారం రోజులుగా నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నా అధికారులు స్పందించకపోవడం పాలనా వైఫల్యానికి నిద ర్శనమని మండిపడ్డారు. ప్రజల కనీస అవసరమైన తాగునీటిని కూడా అందించలేని పరిస్థితి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు.శనివారం మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య నేతృత్వంలో బీజేపీ నాయకులు వెల్టూరు లోని యాదవుల, తెలుగువారి, వాల్మీకి, కాల్వకట్ట, ఎస్సీ, ఓసీ కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ నాయకులు కురువ చిన్నమల్లయ్య, జిల్లా జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్రెడ్డి, మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య మాట్లాడుతూ.. బోర్లు ఎండిపోతున్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే కొత్త బోర్లు వేయడంతో పాటు చేతిపంపులకు మరమ్మతులు చేసి నీటి సరఫ రాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.శిథిలావస్థలో వాటర్ ట్యాంక్?వెల్టూరులోని వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడిప డుతున్నాయని బీజేపీ నాయకులు తెలిపారు. నీళ్లు అందించాల్సిన ట్యాంకే ప్రజలకు ప్రమాదంగా మారడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని విమర్శించారు. వెంటనే పాత ట్యాంక్ స్థానంలో కొత్త వాటర్ ట్యాంక్ నిర్మించాలని కోరారు.అలాగే గ్రామంలో వీధి దీపాలు సక్రమంగా వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నీరు, వెలుతురు వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రజల తరఫున బీజేపీ మరింత గట్టిగా పోరాడుతుందని హెచ్చరించారు.అనంతరం సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీడీవో సూర్ణ ఆదర్శ గౌడ్, సర్పంచ్ బెక్కెం సుజాతమ్మలకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జగ్గారి శ్రీధర్రెడ్డి, కురువ చిన్నమల్లన్న, బొగ్గు కురుమయ్య గణేష్రెడ్డి, మేకల చెన్నయ్య సంపత్ కుమార్, మద్దిలేటి యాదవ్, రాము, ఉమేష్ చంద్ర, వెంకటస్వామి, శివ కుమార్రెడ్డి, భూపాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోనాల జాతర సందర్భంగా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎం పి వద్దిరాజు



**ఖమ్మం, ఆగస్ట్ 01, నేటి శుభోదయ :** సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి (మహం కాళి) బోనాల జాతర సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభా కాంక్షలు తెలిపారు.ఆషాఢ మాసంలో తొట్టతొ లుత గోల్కొండ శ్రీశ్రీశ్రీ జగదాంభిక అమ్మ వారికి బోనం సమర్పించాక, తర్వాత బల్కంపేట ఎల్లమ్మ, ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి (మహంకాళి)అమ్మవారి బోనాల జాతర జరుగుతుందన్నారు.బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని,భక్తి సంప్రదాయాలు,విశ్వాసాలకు నిలువెత్తు నిదర్శ నమని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. ఇదొక పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే, విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే జానపద, ఆధ్యాత్మిక వేడుక అని కొనియాడారు.బోనాల జాతరలో భాగంగా వినిపించే రంగం (భవిష్య వాణి),అమ్మ వారి ఊరేగింపు,జరిగే పోతురా జుల విన్యాసాలు,శివసత్తుల పూనకాలు,ఘట్టాల ఊరేగింపులు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటి చెబుతాయన్నాయని వివరిం చారు.తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన ఈ పండుగ విశిష్టత రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం సందర్భంగా, కల్వకుంట్ల చంద్రశేఖర రావు పదేళ్ల పాలనలో ప్రపంచం నలుమూల లకు వ్యాప్తిచెంది మరింత ప్రాచుర్యం పొందిందని ఎంపీ రవిచంద్ర తెలిపారు.బోనా లను కేసీఆర్ తెలంగాణ పండుగగా అధికారి కంగా ప్రకటించడమే కాక ఉత్సవాల నిర్వహ ణకు నిధులు మంజూరు చేసే వారని చెప్పారు.మహంకాళి అమ్మ వారి కరుణాకటా క్షాలతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని,ప్రజలందరి జీవితాల్లో ఆనందం, శాంతి వెల్లివిరియాలని ఎంపీ రవిచంద్ర ఆకాం క్షించారు.ఈ పండుగను ప్రశాంత వాతావర ణంలో కుటుంబ సభ్యులు,బంధుమిత్రులతో కలిసి భక్తిప్రపత్తులతో జరుపుకోవాల్సిందిగా ఎంపీ వద్దిరాజు కోరుతూ తెలంగాణ బిడ్డలంద రికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## సర్వజ్ఞలో మెహందీ ఉత్సవ్ : చిన్నారుల చేతుల్లో కళా సౌందర్యం

**ఖమ్మం,ఆగస్టు01, నేటి శుభోదయ :** ఖమ్మం విడీఓస్ కాలనీ నందు సర్వజ్ఞ పాఠశాలలో శనివారం చిన్నారుల కోసం మెహందీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్లో బాలికలు ఒకరి చేతికి ఒకరు అందమైన మెహందీ డిజైన్లను వేసుకున్నారు. వివిధ రకాల సంప్రదాయ, ఆధునిక డిజైన్లతో చిన్నారుల చేతులు కళకళలాడాయి. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు కూడా చిన్నారులకు మెహందీ వేయడంలో సహాయపడ్డారు. విద్యార్థులు తమకు ఇష్టమైన డిజైన్లను ఎంచుకొని, వాటిని తమ చేతులపై వేసుకుని ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ "విద్యార్థులలో కేవలం విద్యాపరమైన నైపుణ్యాలను మాత్రమే కాకుండా, వారిలో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికి తీయడం మా లక్ష్యం. మెహందీ ఉత్సవాలు వంటి కార్యక్రమాలు పిల్లలలో సృజనాత్మకతను, సాంస్కృతిక అవగాహనను పెంపొంది స్తాయి. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని పేర్కొన్నారు. ఈ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదు, దీని వెనుక ఎన్నో ఆరోగ్య, సామాజిక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తెలుగు సంస్కృతిలో గోరింటాకు ఆషాఢ మాసం లో ఒక ముఖ్యమైన భాగం. గోరింటాకును శుభానికి, సౌభాగ్యానికి ప్రతీకగా భావిస్తారు. ఆరోగ్య ప్రయోజనాలు శరీర ఉష్ణోగ్రత నియంత్రణ, నరాల ఉపశమనం, రక్త ప్రసరణ మెరుగుదల అనేక రకాల వ్యాధులను నియంత్రిస్తుందని తెలిపారు. పాఠశాల కరె స్పాండెంట్ నీలిమ మాట్లాడుతూ "విద్యార్థులు పాఠశాలలో నేర్చుకునే ప్రతి అంశం వారి భవిష్యత్తుకు పునాది కావాలి. ఈ మెహందీ వేడుకలు పిల్లలకు ఆనందాన్ని ఇవ్వడమే కాకుండా, వారిలో సహకారం, సృజనాత్మకత, సామాజిక ఐక్యత వంటి విలువ లను పెంపొందిస్తాయి. ప్రతి విద్యార్థి తమ బాల్యాన్ని ఆనందంగా గడపడంతో పాటు, నూతన విషయాలను నేర్చుకోవాలని కోరుకుం టున్నాము" అని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.మెహందీ ఉత్సవాలు విజయ వంతంగా ముగిశాయి.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యా యులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు.






Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620